నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

పుణెలో జికా వైరస్ కలకలం.. 67 ఏండ్ల వ్యక్తిలో గుర్తింపు

ముంబై, డిసెంబర్ 2: మహారాష్ట్రలోని పుణె నగరంలో జికా వైరస్ కలకలం రేగింది. పుణెలోని బవ్‌ధాన్ ఏరియాలో 67 ఏండ్ల వృద్ధుడికి జికా వైరస్ సోకింది. పేషెంట్‌లో జికా వైరస్ ఉన్నట్లు పుణెలో బయటపడినా వాస్తవానికి ఆయన నాసిక్‌కు చెందినవాడు. గత అక్టోబర్ 22న అతను నాసిక్ నుంచి సూరత్‌కు వెళ్లాడు. గత నెల 6న ఆయన సూరత్ నుంచి పుణెకు చేరుకున్నాడు.

అదే సమయంలో వృద్ధుడు అనారోగ్యానికి గురవడంతో వైద్యులు ఆయన నుంచి శాంపిల్స్ తీసి పరీక్షల కోసం పుణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. గత నెల 30న పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ఆ వృద్ధిడిలో జికా వైరస్ ఉన్నట్లు తేల్చింది. అయితే ప్రస్తుతం వృద్ధుడు ఆరోగ్యంగానే ఉన్నట్లు మహారాష్ట్ర ఆరోగ్యశాఖ తెలిపింది.

హైదరాబాద్ శనివారం 3-12-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 89 పేజీలు:6 వెల: రూ.1/-

కేపీహెచ్‌బీ కాలనీలో ఇండోర్ షటిల్ కోర్టును ప్రారంభించిన కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 2: రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ కూకట్‌పల్లి నియోజకవర్గంలో పర్యటించారు

. కేపీహెచ్‌బీ కాలనీలోని ఫేజ్ -9లో నిర్మించిన ఇండోర్ షటిల్ కోర్టును కేటీఆర్ ప్రారంభించారు. ఫేజ్ -7 లో నిర్మించిన ఆధునిక వైకుంఠధామాన్ని కూడా కేటీఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో పురపాలక శాఖ ఆధ్వర్యంలో చేపట్టే బోయిన్ చెరువు రిటైనింగ్ వాల్, స్టార్మ్ వాటర్ నాలా, ఐడీఎల్ చెరువు, హెచ్ఐజీ పార్క్ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

3డీ ప్రింటింగ్ పరిశ్రమకు హబ్‌గా మారనున్న హైదరాబాద్ నగరం: కేటీఆర్

హైదరాబాద్ డిసంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: రాబోయే రోజుల్లో హైదరాబాద్ నగరం 3డీ ప్రింటింగ్ పరిశ్రమకు హబ్‌గా మారనున్నదని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇవాళ హైదరాబాద్ హైటెక్‌సిటీలో జరిగిన ఆమ్టెక్ ఎక్స్‌పోలో మంత్రి మట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 3డీ ప్రింటింగ్, ఆవిష్కరణ రంగంపై ప్రధానంగా దృష్టి సారించిందని మంత్రి చెప్పారు. భారత్‌లో టెక్నాలజీని అభివృద్ధి చేసి విదేశాలకు అందించడానికి తాము కృషి చేస్తున్నామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. మెడికల్, ఇండస్ట్రీ రంగాల్లోనూ 3డీ ప్రింటింగ్ సాంకేతికతను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన వివరించారు. రానున్న రెండు రోజులు దేశవిదేశాలకు చెందిన 100కు పైగా పరిశ్రమలు, 50కి పైగా స్టార్టప్‌లు, 15కు పైగా నేషనల్ రిసెర్చ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లు, 3000 మందికి పైగా ప్రతినిధులు ఈ ఎక్స్‌పోలో పాల్గొంటారని చెప్పారు. హైదరాబాద్‌లో ఏరోస్పేస్, డిఫెన్స్, వైద్య పరికరాలు తదితర సదుపాయాల అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నదని, దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని మంత్రి తెలిపారు. స్టార్టప్‌లకు, నూతన ఆవిష్కరణలకు, పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం మంచి ప్రోత్సహం ఇస్తున్నదని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మద్దతు, సహకారంతో రాష్ట్రంలో టీ-హబ్, టీఎస్ఐసీ, వీ-హబ్, టాస్క్ వంటి స్టార్టప్‌లతో సాంకేతిక వ్యవస్థ అభివృద్ధి చెందినదన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ స్టార్టప్ ఇటీవల వార్తల్లో నిలిచిందని, స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ త్రీడీ ప్రింటెడ్ ఇంజిన్‌తో కూడిన ఓ ప్రవేట్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిందని మంత్రి గుర్తుచేశారు. దేశంలో తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగంగా అది గుర్తింపు పొందిందని చెప్పారు. వివిధ పరిశ్రమలు, పరిశోధన సంస్థల నుంచి వచ్చిన ప్రతినిధులు.. తెలంగాణ ప్రభుత్వాన్ని తమ పారిశ్రామిక భాగస్వామిగా చేసుకోవాలని మంత్రి కోరారు. పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్రంలో మంచి స్పేస్ ఉందని చెప్పారు.

తెలంగాణలో అమరరాజా గ్రూప్ భారీ పెట్టుబడి

హైదరాబాద్, డిసెంబర్ 2: తెలంగాణకు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే వేల పరిశ్రమలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. తాజాగా అమరరాజా గ్రూప్ కూడా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో విద్యుత్ వాహనాల బ్యాటరీల తయారీ యూనిట్‌ను నెలకొల్పనున్నట్లు అమరరాజా గ్రూప్ ప్రకటించింది. ఈ మేరకు అమరరాజా సంస్థ, తెలంగాణ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలో లిథియం అయాన్ గిగా ఫ్యాక్టరీ నెలకొల్పనుంది. రాష్ట్రంలో రూ. 9,500 కోట్ల పెట్టుబడులు పెట్టడంతో పాటు 4,500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అమరరాజా గ్రూప్ ప్రకటించింది. ఈ ఒప్పంద కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, అమరరాజా గ్రూప్ డైరెక్టర్ గల్లా జయదేవ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టనున్న అమరరాజా గ్రూప్ సంస్థకు మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడులకు ముందుకొచ్చిన జయదేవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సుమారు రూ. 9,500 కోట్ల పెట్టుబడులు రావడం గొప్ప విషయమన్నారు. అమరరాజా కంపెనీకి అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. 37 ఏండ్లుగా అమరరాజా సేవలందిస్తోంది. పారిశ్రామికవేత్తలకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో మానవ వనరులు సమృద్ధిగా ఉన్నాయని కేటీఆర్ ప్రకటించారు.

పెట్టుబడులకు తెలంగాణ అనుకూలమైన ప్రదేశమని గల్లా జయదేవ్ పేర్కొన్నారు. నూతన సాంకేతికతతో బ్యాటరీల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో మా సంస్థ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. వచ్చే 10 ఏండ్లలో తెలంగాణలో రూ. 9,500 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నామని జయదేవ్ స్పష్టం చేశారు.

సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలి : మంత్రి తలసాని

హైదరాబాద్, డిసెంబర్ 2: రెండో దశ మెట్రో రైలు నిర్మాణ పనులకు ఈ నెల 9వ తేదీన సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీఆర్ఎస్ నాయకులతో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. మెట్రో రెండో దశలో భాగంగా వైండ్ స్పేస్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు రూ. 6,250 కోట్ల వ్యయంతో 31 కిలో మీటర్ల మేర మెట్రో లైన్‌ను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ఈ పనులకు వైండ్ స్పేస్ వద్ద సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అనంతరం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ పోలీస్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. నగరంలోని అన్ని నియోజకవర్గాల నుండి టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైండ్ స్పేస్ జంక్షన్ నుండి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు 31 కిలో మీటర్ల మేర నిర్మించనున్న రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ ప్రాజెక్టు విమానయాన ప్రయాణీకులు, ఐటీ కారిడార్, ఇంకా అనేకమందికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, ప్రభాకర్ రావు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు మాగంటి గోపినాథ్, దానం నాగేందర్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, సాయన్న, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, నియోజకవర్గ ఇంచార్జిలు ఆనంద్ గౌడ్, ప్రేం సింగ్ రాథోడ్, నంద కిషోర్ వ్యాస్, శ్యాం సుందర్ రెడ్డి, సలా ఉద్దిన్ లోది, జీవన్ సింగ్, బక్రి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురాతన కట్టడాలను పరిరక్షించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి తలసాని

హైదరాబాద్, డిసెంబర్ 2: రాష్ట్రంలోని పురాతన కట్టడాలను పరిరక్షించి వాటిని భావితరాలకు అందించాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం బన్సీలాల్ పేట లోని మెట్ల బావి, పరిసరాలలో మున్సిపల్ ప్రిన్స్ పల్ సెక్రెటరీ అరవింద్ కుమార్ తో కలిసి పర్యటించి ఏర్పాట్లను సమీక్షించారు.

మెట్ల బావి, నూతనంగా నిర్మించిన టూరిస్ట్ ప్లాజా భవనం, అందులో ఏర్పాటు చేసిన మెట్ల బావి నమూనా, బావిలో పేరుకుపోయిన పూడిక తొలగింపు సందర్భంగా లభ్యమైన వివిధ రకాల పురాతన పరికరాల ప్రదర్శనను, గార్డెన్ ను పరిశీలించారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో బన్సీలాల్ పేట మెట్ల బావి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ బావిని నిజాం కాలంలో అప్పటి స్థానిక ప్రజల త్రాగునీటి అవసరాల కోసం నిర్మించినట్లు చెప్పారు. బావిలో 500 టన్నుల కు పైగా పూడికను తరలించడానికి 6 నెలల సమయం పట్టిందని వెల్లడించారు.

ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలనే ఆలోచన తో బావి పరిసరాలలో అనేక అభివృద్ధి, నిర్మాణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సాహె స్వచ్ఛంద సంస్థ నిర్వహకురాలు కల్పన, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, కార్పొరేటర్ లు హేమలత, మహేశ్వరి, అధికారులు తదితరులు ఉన్నారు.

5న మంత్రి కేటీఆర్‌తో ప్రారంభం

మెట్ల బావిని ఈ నెల 5 వ తేదీన మున్సిపల్, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

మాతృభాషలో పరిశోధనలతో సత్ఫలితాలు: బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్, డిసెంబర్ 2: శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం కేవలం ఇంగ్లిష్ ద్వారానే సాధించవచ్చనే అపోహలను వీడి మాతృభాషతోనే పరిశోధనలు కొనసాగిస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చని రాష్ట్ర ప్రణాళిక విభాగం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోదవ్ కుమార్ అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వ్యవస్థాపదిన్నోతవం సందర్భంగా ఎన్టీఆర్ కళామందిరంలో విశిష్ట పురస్కారాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు మాతృభాషను ఎవరూ మరిచిపోరాదని, తెలుగు సంస్కృతి సంప్రదాయాలు తెలుగువారికి జీవనాడులని పేర్కొన్నారు. పాశ్చాత్య శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను మాతృభాషలోనే చేశారని వివరించారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయంలోని ఖాళీగా ఉన్న ఉద్యోగాలతో పాటు అదనంగా మరో వెయ్యి ఉద్యోగాలను నియమించడానికి ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. సాంస్కృతిక సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం కోర్సులు కేవలం స్వయం ఉపాధికే పరిమితం కాకుండా, ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించే విధంగా కోర్సులను రూపొందించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. అనంతరం 2020 సంవత్సరానికిగాను సాహిత్యరంగం నుంచి ప్రముఖ సాహితీవేత్త, రచయిత డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి, 2021 సంవత్సరానికిగాను సాంస్కృతిక రంగం నుంచి ప్రసిద్ధ సంగీత రికార్డుల సేకర్త, సంగీత, సాహిత్య, నృత్య కళా విమర్శకులు వి.ఎ.కె. రంగారావులకు విశిష్ట పురస్కారాలను అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్ రావు, విశ్వవిద్యాయ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ పాల్గొన్నారు.



ఇస్రో సైంటిస్ట్ నంబి నారాయణ్ కేసులో సుప్రీం కీలక తీర్పు..!

న్యూ డిల్లీ డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఇస్రో సైంటిస్ట్ నంబి నారాయణ్ విదేశీయులకు క్రయోజనిక్ ఇంజిన్ కు సంబంధించిన కీలక పత్రాలను రహస్యంగా చేరవేశారని ఆయనపై కేరళ పోలీసులు గతంలో అభియోగాలు మోపారు. అయితే గూఢచర్యం కేసులో నంబీ నారాయణ్ ను కుట్రపూరితంగా ఇరికించారని సీబీఐ పోలీసులు తొలి నుంచి తమ వాదనలు విన్పిస్తున్నారు. 1994లో వెలుగు చూసిన ఈ ఘటన వల్ల రెండు దశాబ్దాలపాటు క్రియోజనిక్ ఇంజన్ పనులు ఆలస్యంగా జరుగాయని.. ఈ వ్యవహారంలో విదేశీ కుట్ర ఉందని సీబీఐ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా నంబీ నారాయణపై జరిగిన కుట్రపై కేరళ హైకోర్టులో వాదనలు నడుస్తున్నాయి.

ఈ కేసు నిమిత్తం నాటి పోలీస్ అధికారులైన గుజరాత్ మాజీ డీజీపీ ఆర్బీ శ్రీ కుమార్.. రిటైర్డ్ నిఘా అధికారి పీఎస్ జయప్రకాశ్.. ఇద్దరు పోలీస్ అధికారులు ఎస్. విజయన్.. థంపి ఎస్ దుర్గా దత్ లపై సీఐబీ కేసులు పెట్టింది. అయితే నిందితులు మందుస్తు బెయిల్ కు దరఖాస్తు చేసుకోగా కేరళ హైకోర్టు ఇటీవల మంజూరు చేసింది. ఈ నిర్ణయంపై సీబీఐ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. నంబి నారాయణ్ పై కుట్రపూరితంగా కేసు పెట్టడం వల్ల క్రియోజనిక్ ప్రాజెక్టు పనులు నిలిచి పోయాయని.. రెండు దశాబ్దాలపాటు రోదసీ కార్యక్రమాలు వెనుకబడ్డాయని సీబీఐ సుప్రీంలో వాదించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని కోర్టుకు విన్నవించారు. విదేశీ కుట్రలో పోలీసులు భాగమై ఉండొచ్చని పేర్కొంది.

నిందితులకు ముందస్తు బెయిల్ ఇవ్వడం వల్ల విచారణలో ఆటంకం కలిగే అవకాశం ఉందని సీబీఐ తన వాదనలు వినిపించారు. సీబీఐ వాదనలు విన్న కోర్టు నిందితులకు కేరళ హైకోర్టు ఇచ్చిన ముందస్తు తీర్పును కొట్టి వేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లను తిరిగి కేరళ హైకోర్టుకే పంపిస్తున్నామని సుప్రీంకోర్టు చెప్పింది. నిందితుల బెయిల్ పిటిషన్ ను మళ్లీ మొదటి నుంచి విచారించి నాలుగు వారాల్లో తుది నిర్ణయం వెల్లడించాలని కేరళ హైకోర్టుకు సుప్రీం గడువు విధించింది. అదేవిధంగా బెయిల్ దరఖాస్తులపై కోర్టు తీర్పు వెలువడే దాకా నిందితులను అరెస్టు చేయద్దని జస్టిస్ ఎం ఆర్ షా.. జస్టిస్ సీ.టీ. రవికుమార్ ధర్మాసనం నేడు కీలక తీర్పు వెలువరించింది.

పాక్ రాయబారిపై కాబూల్‌లో హత్యాయత్నం.. ఖండించిన పాక్ ప్రధాని

ఇస్లామాబాద్, డిసెంబర్ 2: తాలిబన్ పాలనలో ఉన్న ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో పాకిస్థాన్ రాయబారిపై హత్యాయత్నం జరిగింది. అయితే భద్రతా సిబ్బందిని ఆయనను కాపాడారు. ఈ క్రమంలో ఒక సెక్యూరిటీ గార్డుకు బుల్లెట్ గాయాలయ్యాయి. కాగా, తమ రాయబారిపై దాడిని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఖండించారు. ఈ హేయమైన చర్యకు పాల్పడిన వారిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాక్ రాయబారి ప్రాణాలను కాపాడిన సెక్యూరిటీ గార్డు వీరత్వాన్ని కొనియాడారు. రాయబారిని కాపాడే ప్రయత్నంలో కాల్పుల్లో గాయపడిన ఆ సెక్యూరిటీ గార్డు త్వరగా కోలుకోవాలని ఆయన ప్రార్థించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ట్వీట్ చేశారు.

కాగా, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ సరిహద్దులో ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దీనిని నివారించి ఇరు దేశాల మధ్య సఖ్యతను పెంపొందించేందుకు పాకిస్థాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి హీనా రబ్బానీ ఇటీవల కాబూల్‌లో పర్యటించారు. ఇది జరిగిన కొన్ని రోజులకే కాబుల్‌లోని పాకిస్థాన్ రాయబారిపై హత్యాయత్నం జరిగింది. అయితే ఆయన ప్రాణాలతో బయటపడినట్లు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తెలిపారు. తమ దేశ రాయబారిపై దాడిని ఆయన ఖండించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా యున్న 44వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి-విద్యాశాఖ మంత్రి కార్యాలయం ముట్టడి

హైదరాబాద్ డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్)ల్;ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 44 వేల టీచర్ పోస్టులు వెంటనే భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీచేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు పెద్ద యెత్తున విద్యాశాఖ మంత్రి కార్యాలయం ముట్టడి చేశారు. ఈ సందర్భంగా పెద్ద యెత్తున్న నినాదాలు ఇచ్చారు. ఈ ముట్టడి తెలంగాణ జాక్ ఛైర్మన్ నీల వెంకటేష్, నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ 44 వేల టిచర్ పోస్టులు భర్తీ చేయకుండ ప్రభుత్వం విద్యావ్యవస్థ ను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. కవైపు ప్రభుత్వం పర్మి నెంట్ టిచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు విద్యా ప్రమాణాలు దెబ్బ తింటున్నాయి. పర్మనెంట్ టీచర్లను నియమించకుండా టెంపరరీ టీచర్లకు రకరకాల పేర్లతో నియమించి విద్య వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. పార్ట్ టైం టీచర్లు, గెస్ట్ టీచర్లు, ఆవర్లి బెసేడ్ టీచర్లు, విద్యా వాలంటరీలు, కాంట్రాక్టులు టీచర్లు అంటూ రకరకాల పేర్లతో సంవత్సరాల తరబడి తాత్కాలిక టీచర్లను నియమించి విద్యా వ్యవస్థను పాడు చేశారని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో రాజేందర్, అనంతయ్య, బత్తులమల్లేష్ యాదవ్,చంటి ముదిరాజు, దీపికా బిల్లా, వాణి రెడ్డి, బి.మణికంఠ, భాస్కర్, కాకుమాను జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



రసాయన విపత్తు ముందు అందరూ సమానమే..!

(04 డిసెంబరు "రసాయన విపత్తుల నివారణ దినం" సందర్భంగా)

ప్రపంచ మానవాళిని, ముఖ్యంగా దేశవాసుల్ని విస్మయానికి గురిచేసిన రసాయన విపత్తుగా చరిత్రలో నిలిచిన విషాదం "భోపాల్ గ్యాస్ దుర్ఘటన" అని మనకు తెలుసు. 03 డిసెంబరు 1984 కాళరాత్రి జరిగిన ఈ విష రసాయన మహావిపత్తు 20,000లకు పైగా ప్రాణాలను మింగిడమే కాకుండా దాదాపు 4.6 లక్షల భోపాల్ నగరవాసులకు తీవ్ర శ్వాసకోశ, నరాల, నేత్ర, మానసిక దీర్ఘకాలిక జబ్బులను మిగిల్చింది. మనసుల్ని పిండేసిన ఈ పారిశ్రామిక రసాయన విపత్తుకు కారణంగా 'యూనియన్ కార్బైడ్ పెస్టిసైడ్ ప్లాంట్' నుంచి లీకైన 'మిథైల్ ఐసోసయనేట్, మిక్' విష వాయువు సమీప ఆవాసాలను కమ్మి వేల ప్రజల ప్రాణాలను నిర్దయగా తీసేసింది. ఇలా రసాయన పరిశ్రమల నుంచి అనుకోకుండా లేదా మానవ నిర్లక్ష్యంతో విష వాయువులు విడుదల కావడం, విస్ఫోటనం చెందడం, మంటలు ఎగిసి పడడం లాంటి దుర్ఘటనలను 'రసాయన విపత్తులు'గా నిర్వచిస్తారు. రసాయన విపత్తుల ఫలితంగా మానవాళి మాత్రమే కాకుండా సకల ప్రాణికోటి, పర్యావరణం కూడా తీవ్ర దుష్ప్రభావాలకు నోనవుతాయి.

రసాయన విపత్తుల నివారణ దినం-2022:

అత్యంత ప్రమాదకర రసాయన విపత్తులను నివారించడానికి, అవగాహనలు కల్పించడానికి, దుష్ప్రభావాలను ఆకలింపు చేసుకోవడానికి వేదికగా ప్రతి ఏట 04 డిసెంబరున ప్రపంచవ్యాప్తంగా 'రసాయన విపత్తుల నివారణ దినం' పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. విశ్వవ్యాప్తంగా అత్యంత ప్రమాదకర, విధ్వంసకర రసాయన విపత్తుల్లో విండ్ స్కేల్ రియాక్టర్ మంటలు (1957), చిలీ గనుల్లో దుర్ఘటన (1907), యూయస్ డీప్ వాటర్ హెరైజాన్ విస్ఫోటనంలో చమురు లీకేజీ (1979), భోపాల్ వాయు దుర్ఘటన (1984) లాంటి పలు రసాయన విపత్తులు అంతర్జాతీయ చరిత్రలో విషాద ఘటనలుగా నిలిచాయి.

భారత్‌లో రసాయన విపత్తులు:

ఇండియాలో ఆంధ్రప్రదేశ్ విశాఖ నగర శివారులో లీకైన 'స్టైయరిన్ మోనోమర్' విషవాయు దుర్ఘటన (07 మే 2020), భోపాల్ మిక్ వాయు దుర్ఘటన (1984), ఝార్ఖండ్ చస్నాలా మైనింగ్ ఘటన (1975), బాంబే డాక్స్ విపత్తు (1944), ఛత్తీస్‌ఘడ్ కోర్బా చిమ్నీ ఘటన, రాజస్థాన్ ఆయిల్ డిపో మంటలు (2009), యూపీ యన్‌టిపిసి పవర్ ప్లాంట్ విస్ఫోటనం (2017), మాయావికి రేడియోలాజికల్ ఘటన (2010), వైజాగ్ రిఫైనరీ విస్ఫోటనం (2013), నాగారం గేయిల్ పైప్‌లైన్ విస్ఫోటనం (2014), బిలాయ్ స్టీల్ ప్లాంట్ లీకేజీ (2014), కాన్పూర్ ఆమోనియా లీకేజీ (2017), బెలూర్ క్లోరిన్ లీకేజ్ (2017) లాంటి అనేక విషాదకర రసాయన దుర్ఘటనల్లో వేల మరణాలు, పర్యావరణ విఘాతాల వివరాలు భారత చరిత్ర పుటల్లో చీకటి వార్తలుగా చోటు దక్కించుకున్నాయి.

మానవ నిర్లక్ష్యం నేర సమానం:

ఉద్దేశ్యపూర్వకంగా, యాజమాన్య నిర్లక్ష్యం లేదా ఉద్యోగుల నిర్లక్ష్యం/సోమరితనం కారణంగా జరిగే ఇలాంటి రసాయన విపత్తుల్లో అకారణంగా బాధలు భరించే వారు సాధారణ అమాయక ప్రజలే అని అర్థం చేసుకోవాలి. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయటానికి ప్రభుత్వాలు, యాజమాన్యాలు చేయి చేయి కలిపి, నియమనిబంధనల్ని విధిగా పాటిస్తూ, భద్రత సమీక్షలు చేస్తూ, తగు పటిష్ట ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. పారిశ్రామిక నిర్లక్ష్యానికి భారీ మూల్యాలు, బాధ్యులపై క్రిమినల్ కేసులు, పాత బడిన యంత్రాలు/టాంకులను తొలగించడం, చట్టాల అమలు లాంటి ముఖ్య అంశాల్లో దృష్టికేంద్రీకరించాలి. రసాయన విపత్తులను నిరోధించే విస్ఫోటన చట్టం-1884, పెట్రోలియం చట్టం-1934, ఫ్యాక్టరీ చట్టం-1948, కీటకనాశిని చట్టం-1968, పర్యావరణ రక్షణ చట్టం-1986, మోటారు వాహన చట్టం-1988, పబ్లిక్ లయబులిటీ ఇన్సురెన్స్ చట్టం-1991, విపత్తుల నిర్వహణ చట్టం-2005 లాంటి అనేక భారత చట్టాల కఠిన అమలుకు కంకణ బద్ధులం కావాలి.

రసాయనాలకు తరతమభేదాలు ఉండవు:

రసాయన విష అణువుకు విచక్షణ ఉండదని, అన్ని ప్రాణులు దాని ముందు సర్వసమానులని, చేతులు కాలక ముందే ఆకులు సిద్ధం చేసుకొని, రసాయన విపత్తుల నిర్వహణలో, నిరోధించడంలో ప్రభుత్వ శాఖలు, యాజమాన్యాలు, ఉద్యోగులు, కార్మికులు ప్రతిన బూనాలి. రసాయన విపత్తుల నియంత్రణ యంత్రాంగాన్ని సర్వదా సిద్ధంగా ఉంచాలి. రసాయన ప్లాంట్ల సమీపాన జనావాసాలు లేకుండా చూడాలి. యాజమాన్యాల స్వార్థ ఆలోచనల్ని ఆదిలోనే తుంచేయాలి. దేశ సమగ్రాభివృద్ధికి పరిశ్రమలు తప్పనిసరి. సానుకూల హరిత, పారిశ్రామిక, డిజిటల్ విప్లవాలతో భారతదేశ దశ దిశలను మార్చే యజ్ఞంలో అందరం భాగస్వామ్యం పొందాలి.

అభివృద్ధి కన్న ప్రాణాలు మిన్నయని, ప్రాణాల మనుగడకు పర్యావరణ ఆరోగ్యమే ప్రధానమనే ఆకలింపుతో సుస్థిర అడుగులు వడివడిగా వేస్తూ, సర్వతోముఖాభివృద్ధి చెందిన సుందర, సంపన్న భారతాన్ని నిర్మించే కార్యంలో పాలుపంచుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఏపీ పోలీస్ శాఖలో బిగ్ ఫైట్

అమరావతి డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఏపీ పోలీస్ శాఖలో బిగ్ ఫైట్ నడుస్తోంది. ఒకు పోలీస్ బాస్.. ఇంకొకరు ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు తన పరిధి దాటి వ్యవహరిస్తుండడంతో డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి మండిపడుతున్నారు. ప్రభుత్వ అధినేతకు రెండు కళ్లలా ఉండే ఈ ఇద్దరు ఐపీఎస్‌లు పోలీసుశాఖపై పూర్తిస్థాయి పట్టుకోసం చేస్తున్న ప్రయత్నాలు చర్చనీయాంశం అయ్యాయి. దేశంలోని ఏ రాష్ట్రంలో అయినా పోలీసు దళాల అధిపతితో పాటు నిఘా విభాగం అధిపతి అక్కడి ప్రభుత్వాలకు కీలకం. రాష్ట్రంలో ఏ మూల ఏం జరుగుతోంది.. ఎక్కడెక్కడ ఎవరెవరు ఏం చేస్తున్నారో.. సమాచారం సేకరించి నిఘావిభాగం అప్రమత్తం చేస్తే అందుకు అనుగుణంగా చట్టపరమైన చర్యలకు పోలీసులు ఉపక్రమించి శాంతి భద్రతలు పరిరక్షిస్తారు. అంతేగాక ప్రభుత్వానికి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతారు. ఈ రెండు కీలక పోస్టుల్లో ఉండే ఐపీఎస్ అధికారుల మధ్య సఖ్యత లేకపోతే ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవు. అందుకే డీజీపీ ర్యాంకు అధికారి ఉంటే ఇంటెలిజెన్స్ చీఫ్‌గా అడిషనల్ డీజీ కేడర్ ఐపీఎస్ ఉంటారు. అయితే రాష్ట్రంలో ప్రస్తుతం ఆ రెండు పోస్టుల్లోనూ డీజీ ర్యాంకు అధికారులే ఉండటంతో ఆదిపత్య పోరు మొదలైంది.

అది కూడా ఒకే బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్‌లు కావడంతో మరింత ముదురుతోంది. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు చెందిన అడిషనల్ డీజీ కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డిని మూడేళ్ల క్రితం నిఘా విభాగం అధిపతిగా నియమించిన జగన్ ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో డీజీపీగా పదోన్నతి కల్పించి ఏసీబీ డీజీగా నియమించింది. తమకు అన్నివిధాలా అనుకూలంగా ఉంటారని ఫిబ్రవరి మూడో వారంలో పోలీస్ బాస్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది.

అప్పటిదాకా ఏసీబీ డీజీగా ఉన్న పీఎస్ఆర్ ఆంజనేయులును ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ చేసిన వైసీపీ ప్రభుత్వం ఇద్దరు అధికారులతో కీలకంగా పని చేయించుకుంటోంది. సౌమ్యంగా కనిపించే డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ప్రభుత్వ పెద్ద వద్ద తలూపినా పోలీసింగ్‌లో మరీ ఏకపక్షంగా కాకుండా పద్ధతిగానే పనిచేస్తున్నారు. కోనసీమలో కొట్లాటలు జరిగినా.. ప్రభుత్వ ఉద్యోగులు నిరసనకు పిలుపిచ్చినా.. అమరావతి రైతులు పాదయాత్ర చేపట్టినా.. గతంతో పోలిస్తే మెరుగ్గానే వ్యవహరించారు. ఇది ప్రభుత్వ పెద్దలకు రుచించలేదో ఏమో కానీ పోలీస్ బాస్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించి పది నెలలు కావస్తున్నా ఎఫ్ఎసీగానే కొనసాగిస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన చక్రవర్తి



అమరావతి: డిసెంబర్ 2: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ ఎస్పీగా కె.చక్రవర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. టాస్క్ ఫోర్స్ అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు ఏఎస్పీగా ఉండగా పదోన్నతి మీద టాస్క్ ఫోర్స్ ఎస్పీగా బదిలీపై వచ్చారు. ఛార్జ్ తీసుకుని మాట్లాడుతూ టాస్క్ ఫోర్స్ ఎస్పీగా ఎర్రచందనం పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శేషాచలం అడవులు నుంచి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటానని అన్నారు. స్మగ్లర్లను ఉక్కుపాదంతో అణచి వేస్తామని అన్నారు. దీనికి ప్రత్యేక వ్యూహాలను, ఇతర అధికారులతో కలసి రూపొందిస్తామని తెలిపారు. తరువాత టాస్క్ ఫోర్స్ ఆర్ఐ, సీఐ,ఎస్ఐ తదితర అధికారులతో సమావేశమయ్యారు.

జాత్యహంకార ధోరణిని ఎదిరించాలి: బ్రిటన్ ప్రధాని

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: బ్రిటిష్ రాజ కుటుంబంలో జాత్యహంకార ధోరణి వెలుగుచూసిన నేపథ్యంలో దానిపై ఆ దేశ ప్రధాని రిషి సునాక్ స్పందించారు. జాత్యహంకార ధోరణి ఎప్పుడు, ఎక్కడ ఎదురైనా తప్పనిసరిగా ఎదిరించాలన్నారు. బాల్యంలో తాను కూడా జాత్యహంకారాన్ని ఎదుర్కొన్నానని, అయితే ఇప్పుడు దేశం పురోగమించిందని తాను విశ్వసిస్తున్నానని చెప్పారు. అయితే బ్రిటన్ రాజ కుటుంబం గురించి కానీ, ఇటీవల అక్కడ వెలుగుచూసిన సంఘటన గురించి కానీ సునాక్ నేరుగా ప్రస్తావించకపోవడం గమనార్హం.

జాత్యహంకారాన్ని ఎదుర్కోవడంలో దేశం అద్భుతమైన ప్రగతి సాధించిందని, అయితే దాన్ని నిర్మూలించే పని ఇంకా పూర్తి కాలేదని రిషి సునాక్ చెప్పారు. అందుకే అది ఎప్పుడు కనిపించినా ఎదిరించాలన్నారు. ప్రిన్స్ విలియం గాడ్ మదర్ లేడీ సుసాన్ హసీ జాత్యహంకార ధోరణి ప్రదర్శించారనే ఆరోపణలు కలకలం రేపాయి. ఆమె ఓ ఆఫ్రికన్‌తో వ్యవహరించిన తీరు విమర్శలకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే రిషి తన అభిప్రాయాలను వ్యక్తంచేశారు.

ఆఫ్రికా, కరీబియన్ మూలాలుగల బ్రిటిష్ జాతీయురాలు ఎన్‌గోజీ ఫులని (ఔణనీళితి ఈబీశ్రీజీనితి) ట్విటర్లో వెల్లడించిన విషయాలు ఈ వివాదానికి కారణమయ్యాయి. రాయల్ ఎయిడ్ సుసాన్ హసీ తనను పదేపదే "ఆఫ్రికాలో ఏ ప్రాంతం నుంచి వచ్చారు మీరు?" అని ప్రశ్నించడం హింసించినట్లుగా అనిపించిందని చెప్పారు. కింగ్ ఛార్లెస్ సతీమణి కెమిల్లా ఆతిథ్యమిచ్చిన ఓ కార్యక్రమానికి తాను హాజరయ్యానని, అప్పుడు హసీ పదేపదే ఆ ప్రశ్న అడగడం బాధించిందన్నారు. చివరకు "నేను ఇక్కడే పుట్టాను, బ్రిటిషర్‌ను" అని చెప్పానని తెలిపారు.

ఈ నేపథ్యంలో రాయల్ ఎయిడ్ హసీ తన పదవికి రాజీనామా చేశారు. తాను ప్రవర్తించిన తీరుకు క్షమాపణ కోరారు. బకింగ్‌హామ్ ప్యాలెస్ విడుదల చేసిన ప్రకటనలో కూడా సుసాన్ హసీ వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదని, తీవ్రంగా విచారించదగినవని పేర్కొన్నారు.

పరిపూర్ణమైన విద్యకు మార్కులే ప్రామాణికం కాదు

-రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత

-ప్రపంచపోటీని తట్టుకనేలా విద్యాబోధన : జోగి

-పరిశ్రమతో సాంకేతిక విద్య అనుసంధానం : చదలవాడ

-ప్రతిభ ప్రదర్శించిన విధ్యార్దులకు నగదు బహుమతులు

-ఘనంగాముగిసినపాలీటెక్నిస్ట్ 2022

అమరావతి డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్); మార్కులు తెచ్చుకోవటమే విద్యాభ్యాసం కాదని, జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంచుకోవడమే విద్య అని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. సాంకేతిక విద్యా శాఖ గత మూడు రోజులుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పాలీ టెక్ ఫెస్ట్ 2022 ముగింపు కార్యక్రమం నగరంలోని ఎస్ ఎస్ కన్వేన్షన్ లో వేడుకగా సాగింది. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందచేసారు. ముఖ్య అతిధిగా హాజరైన వనిత మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించే అద్భుతమైన ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులు అభినందనీయుల న్నారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహాన్ని కొనసాగించి ఉజ్వల భవిష్యత్తు సొంతం చేసుకోవాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించి, వాటిని అధికమించేందుకు సిద్ధం కావాలన్నారు. స్వార్థ ప్రయోజనాల గురించి ఏనాడూ ఆలోచించని ముఖ్యమంత్రి విద్యార్థుల కోసం విభిన్న పథకాలను అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి శాస్త్ర వేత్తలని, ప్రపంచ పోటీని తట్టుకునేలా ప్రతి విద్యార్థి తయారు కావాలన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, మాతృభూమికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. విద్యార్థులు తమ నైతిక ప్రవర్తనను పెంపొందించుకోవాలని, సమాజాన్ని ఇబ్బంది పెట్టేలా నడవడిక ఉండరాదని ఉద్బోధించారు. విద్యార్థుల సంక్షేమం, ఉపాధి కోసం ఎన్నో ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నమన్నారు.సాంకేతిక విద్యాశాఖ సంచాలకురాలు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ తగిన ప్రోత్సాహం అందిస్తే విద్యార్థులు తమదైన శైలిలో రాణిస్తారన్న విషయం ఈ టెక్ ఫెస్ట్ నిరూపించిందన్నారు. ఇకపై ప్రతి సంవత్సరం ఈ సాంకేతిక ఉత్సవాన్ని నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ముఖమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆలోచనల మేరకు సాంకేతిక విద్యను పరిశ్రమతో అనుసంధానం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎపి ఇన్నోవేషన్ సొసైటీ సిఇఓ అనిల్ కుమార్, సాంకేతిక విద్యాశాఖ సంయిక్త సంచాలకులు పద్మారావు కార్యదర్శి విజయ భాస్కర్, ఇతర అధికారులు సత్యనారాయణ మూర్తి, ఎ.నిర్మల్ కుమార్ ప్రియ తదితరులు పాల్గొన్నారు. టెక్ ఫెస్ట్ లోగో రూపకల్పనలో దాదాపు 90 మంది పాలిటెక్నిక్‌లు పాల్గొనగా, గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యర్థులు ఉత్తమమైన లోగో రూపొందించి ఐదువేల రూపాయల నగదు బహుమతి పొందారు.

పాలీ టెక్ ఫెస్ట్ లో విజేతలు : 253 ప్రాజెక్టులలో లక్ష రూపాయల రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి అనకాపల్లి జిల్లా చోడవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ బృందం రూపొందించిన "స్మార్ట్ స్టిక్ ఫర్ విజువల్లీ ఛాలెంజ్డ్" కు దక్కింది. యాభైవేల రూపాయల రెండవ బహుమతి ఒంగోలు జిల్లా వల్లూరు కృష్ణ సాయి పాలిటెక్నిక్ బృందం తయారు చేసిన ఆటోమొబైల్ క్రాష్ డిటెక్షన్ ఉ ఇంటిమేషన్ కు లభించింది. 13 ప్రాజెక్టులకు తృతీయ బహుమతిని అందించగా ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, సూరంపాలెం, కాకినాడ, ప్రభుత్వ పాలిటెక్నిక్, తాడేపల్లిగూడెం, మహిళల ప్రభుత్వ పాలిటెక్నిక్, హిందూపూర్, లయోలా పాలిటెక్నిక్, పులివెందుల , ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్, వైజాగ్. ప్రభుత్వ మహిళల పాలిటెక్నిక్, శ్రీకాకుళం. గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిరామిక్ టెక్నాలజీ, గూడూరు. ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆఫ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ, గుంటూరు, ప్రభుత్వం పాలిటెక్నిక్, కర్నూలు. ప్రభుత్వ పాలిటెక్నిక్, వైజాగ్. అల్-హుదా పాలిటెక్నిక్, నెల్లూరు, మైనారిటీ ప్రభుత్వ పాలిటెక్నిక్, కర్నూలు, మహిళల ప్రభుత్వ పాలిటెక్నిక్, కాకినాడ ఉన్నాయి.

నివారించలేని సహజ నష్టాల కారణంగా తలెత్తే పంట నష్టంపై పిఎంఎఫ్‌బివై కింద సమగ్ర బీమా కవరేజీని అందించడానికి కట్టుబడి ఉన్నామని తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్‌బివై) కింద నివారించలేని సహజ ప్రమాదాల కారణంగా సంభవించే పంట నష్టానికి సమగ్ర బీమా కవరేజీని అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈరోజు పునరుద్ఘాటించింది.

ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్‌బివై) అనేది ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద పంటల బీమా పథకం. ఈ పథకం కింద ప్రతి సంవత్సరం సుమారు 5 కోట్ల మంది రైతుల దరఖాస్తులు అందుకుంటున్నందున రాబోయే సంవత్సరాల్లో ఇది నంబర్ వన్ అవుతుంది. 2016లో పథకం ప్రారంభించినప్పటి నుండి రుణం పొందని రైతులు, సన్నకారు రైతులు మరియు చిన్న రైతుల వాటా 282% పెరగడంతో, గత 6 సంవత్సరాలలో ఈ పథకం యొక్క ఆమోదయోగ్యత రైతులలో పెరిగింది.గత 6 సంవత్సరాల్లో రైతులు రూ. 25,186 కోట్లు ప్రీమియంగా చెల్లించారు. ఇందులో 31 అక్టోబర్, 2022 నాటికి రైతుల క్లెయిమ్‌లకు ప్రతిఫలంగా రూ?.1,25,662 కోట్లు చెల్లించబడ్డాయి, ఈ పథకం కింద ఎక్కువ ప్రీమియంను కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయి.పథకం అమలులో ఉన్న రాష్ట్రాల్లోని రైతులు రబీ 22-23 నమోదుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో వాస్తవ విరుద్ధమైన వార్తా నివేదిక (పరిశీలించిన కేసు విషయంలో గమనించినట్లుగా) ప్రచురించబడింది. మహారాష్ట్రలోని కొన్ని జిల్లాల్లోని రైతులకు చాలా తక్కువ మొత్తంలో బీమా క్లెయిమ్‌లు చెల్లిస్తున్నారని కొన్ని మీడియా విభాగాలలో ప్రచురించబడింది.వార్తా అంశంలో నివేదించబడిన కేసులను పరిశీలించడానికి మంత్రిత్వ శాఖ ప్రయత్నించింది. అయితే నిర్దిష్ట డేటా పాయింట్లు లేకపోవడంతో ఒక రైతును మాత్రమే గుర్తించగలిగింది. శ్రీ పాదురంగ్ భాస్కర్ రావు కదం అనే రైతు మొత్తం ప్రీమియంగా రూ.595 చెల్లించగా.. ఒక పంటకు రూ.37.31, మరో పంటకు రూ.327 పరిహారంగా క్లెయిమ్ పొందినట్లు వార్తల్లో కథనాలు వచ్చాయి. కానీ వాస్తవ క్లెయిమ్ డేటా ప్రకారం ఇప్పటి వరకు అతను చెల్లించిన ప్రీమియంకు దాదాపు నాలుగు రెట్లు మొత్తం అంటే రూ.2080.40 క్లెయిమ్ మొత్తాన్ని అందుకున్నాడు.రూ. 2080.40/- అనేది పార్ట్ క్లెయిమ్‌లు మరియు పార్ట్ పేమెంట్‌లు మాత్రమే చెల్లించబడ్డాయి మరియు అసలు చెల్లింపు కాదు. క్లెయిమ్‌ల తుది సెటిల్‌మెంట్ పూర్తయిన తర్వాత పాండురంగ్ రావు మరింత డబ్బు పొందవచ్చు. అలాగే పర్భానీ జిల్లాలో కొందరు రైతులకు రూ. 50,000 క్లెయిమ్‌లు అందగా ఓ రైతుకు జిల్లా క్లెయిమ్‌ల తుది పరిష్కారానికి ముందు రూ.94,534 అందుకున్నారు.

పర్భానీ జిల్లాలో 6.66 లక్షల రైతు దరఖాస్తులు అందగా అందులో రైతులు రూ.48.11 కోట్ల ప్రీమియం చెల్లించారు. ఇప్పటి వరకు రూ.113 కోట్ల క్లెయిమ్‌లు చెల్లించారు. అయితే, రూ.1000/- కంటే తక్కువ క్లెయిమ్ ఉన్న రైతులకు తుది సెటిల్‌మెంట్ సమయంలో ఏదైనా క్లెయిమ్ వచ్చినట్లయితే కనీసం రూ.1000/- వ్యక్తిగత రైతుకు చెల్లించాలనే షరతుతో చెల్లించబడుతుంది.మహారాష్ట్ర ప్రభుత్వం 79.53 లక్షల దరఖాస్తుల్లో ఖరీఫ్-22లో రాష్ట్రంలో దాదాపు 283 దరఖాస్తులు రూ.100/- లోపు బీమా చేయబడ్డాయని మరియు 21,603 దరఖాస్తులు రూ.1000/- కంటే తక్కువ బీమా మొత్తాన్ని కలిగి ఉన్నాయని, కొంతమంది రైతులు అనేక దరఖాస్తులు కలిగి ఉన్నారని సమాచారం. కొన్ని సందర్భాల్లో, బీమా చేయబడిన వారి ప్రాంతం చాలా తక్కువగా ఉన్నందున మొత్తం క్లెయిమ్ తక్కువగా ఉంటుంది. ఈ సమస్యను అధిగమించడానికి ఒక రైతుకు కనీసం రూ.1000/- క్లెయిమ్ చెల్లించాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిబంధన విధించింది.

ఈ పథకం యాక్చురియల్/బిడ్ చేయబడిన ప్రీమియం రేట్లపై అమలు చేయబడుతోంది. అయితే చిన్న రైతులతో సహా రైతులు ఖరీఫ్‌కు గరిష్టంగా 2%, రబీ ఆహార మరియు నూనెగింజల పంటలకు 1.5% మరియు వాణిజ్య/ఉద్యాన పంటలకు 5% చెల్లించాలి. ఖరీఫ్ 2020 నుండి 90:10 ఈశాన్య ప్రాంతంలో మినహా ఈ పరిమితుల కంటే ఎక్కువ ప్రీమియం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు 50: 50 ప్రాతిపదికన పంచుకుంటాయి. ఈ పథకం బీమా సూత్రాలపై పనిచేస్తుంది కాబట్టి బీమా చేయబడిన ప్రాంతం, పరిధి నష్టం, క్లెయిమ్ మొత్తం మొదలైన ముఖ్యమైన అంశాలు ఉంటాయి.

ఖచ్చితమైన వ్యవసాయంతో పిఎంఎఫ్‌బివై పరిధిని మరియు కార్యకలాపాలను పెంచడంలో డిజిటలైజేషన్ మరియు టెక్నాలజీ ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని మంత్రిత్వ శాఖకు చెందిన ఓ ఉన్నత అధికారి తెలిపారు. అగ్రి టెక్ మరియు రూరల్ ఇన్సూరెన్స్ యూనియన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్‌కు మ్యాజిక్ ఫార్ములాగా ఉంటుంది. ఇది పథకంపై నమ్మకాన్ని కలిగిస్తుంది.ఇటీవల ప్రవేశపెట్టిన వాతావరణ సమాచారం మరియు నెట్‌వర్క్ డేటా సిస్టమ్స్ (విండ్స్) టెక్నాలజీ ఆధారంగా దిగుబడి అంచనా వ్యవస్థ (యెస్-టెక్), నిజ సమయ పరిశీలనల సేకరణ మరియు పంటల ఫోటోగ్రాఫ్‌లు (క్రాప్‌పిక్) వంటి చర్యలు పథకంలో మరింత సమర్థత మరియు పారదర్శకతను తీసుకురావడానికి తీసుకున్న కొన్ని కీలక చర్యలు. రైతుల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఛత్తీస్‌గఢ్‌లో ఒక సమగ్ర హెల్ప్ లైన్ సిస్టమ్ బీటా పరీక్షలో ఉంది.

ఏపీలోని గుంటూరు, విజయవాడలో ఈడీ, ఐటీ దాడులు

అమరావతి డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఏపీలోని గుంటూరు, విజయవాడలోని పలు ఆస్పత్రులు, పలువురి ఇళ్లపై శుక్రవారం ఈడీ, ఐటీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. గుంటూరులోని మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో ఈడీ, ఐటీ అధికారులు నాలుగు బృందాలుగా వీడిపోయి సోదాలు నిర్వహించారు. ఆస్పత్రుల్లోని రికార్డులను పరిశీలించారు. నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్ ఇంట్లోనూ సోదాలు నిర్వహించిన అధికారులు, ఎన్ఆర్ఐ ఆస్పత్రి పాత మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఇళ్లలోనూ సోదాలు చేశారు.విజయవాడలోని అక్కినేని ఉమెన్స్ ఆస్పత్రిలో ఈడీ తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా విదేశీ పెట్టుబడుల వ్యవహారంలో ఈ దాడులు కొనసాగాయి. కొవిడ్ సమయంలో భారీగా అవకతవకలు జరిగాయని గుర్తించిన అధికారులు ఈ దాడులు నిర్వహించారు. సుమారు 1500 మంది కొవిడ్ కేసులకు చెందిన వివరాలను నమోదు చేయాలేదని వారికి కంప్యూటర్ రసీదులు కాకుండా మాన్యువల్ రసీదులు, నకిలీ రసీదులతో నిధులు పక్కదారి పట్టించారని కేసులు నమోదు అయ్యాయి.ఆస్పత్రుల నిర్వహణకు వచ్చిన నిధులు పక్కదారి పట్టించి ఇతర భవనాల కోసం వెచ్చించినట్లు, ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో ఎంబీబీఎస్ సీట్లకు సంబంధిన ఫీజుల విషయంలో నిధుల గోల్‌మాల్ జరిగిందని గుర్తించిన అధికారులు ఆ దిశగా నిర్వాహకులపై దాడులు చేశారు.

కార్పొరేట్ ఉద్యోగాలలో మాజీ అగ్నివీర్‌లకు రిజర్వేషన్‌పై భారత రక్షణ పరిశ్రమతో సమావేశాన్ని ఏర్పాటు చేసిన రక్షణ మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: కంపెనీల కార్పొరేట్ నియామక ప్రణాళిక కింద మాజీ అగ్నివీర్‌లకు లాభదాయక ఉపాధి అవకాశాలు కోరేందుకు భారత రక్షణ ఉత్పత్తిదారుల సమాజం నేతృత్వంలో భారతీయ రక్షణ పరిశ్రమతో నవంబర్ 30, 2022న సమావేశ సెషన్‌ను రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించింది. ఈ సెషన్‌కు రక్షణ కార్యదర్శి శ్రీ గిరిధర్ ఆరమానే అధ్యక్షత వహించారు. ప్రధానమైన భారత రక్షణ పారిశ్రామిక సంస్థలు ఎల్‌డటి, అదానీ డిఫెన్స్ లిమిటెడ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టం లిమిటెడ్, అశోక్ లేలాండ్, తదితర సంస్థల సీనియర్ ఎగ్జిక్యూటివ్ లు ఈ చర్చలో పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో నిమగ్నమైన వివిధ రంగాలలో పూర్తి అంకితభావం, క్రమశిక్షణ, కలిగిన యువతకు లాభదాయక ఉపాధిని కల్పించే లక్ష్యంతో సాయుధ దళాలతో పని చేసిన అగ్నివీర్‌ల నైపుణ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని రక్షణ కార్యదర్శి పట్టి చూపారు. సాయుధ దళాలలో పని చేసిన సమయంలో అగ్నివీర్‌లు గడించిన నైపుణ్యాలు పరిశ్రమతో ఉత్పాదకమైన, ఫలవంతమైన ప

స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష - మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

నల్లగొండ డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణపై సమైక్యవాదుల కన్నుపడిందని చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్‌లో మొహం చెల్లక తెలంగాణలో దండులా విరుచుకుపడుతున్నారని విమర్శించారు. మళ్లీ దోచుకుందామని తెలంగాణలో రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు.తెలంగాణపై ప్రధాని మోదీ అడుగడుగునా విషం చిమ్ముతున్నారని విమర్శించారు. ఎనిమిది రాష్ట్ర ప్రభుత్వాలను మోదీ కూల్చారని ఫైరయ్యారు. ఇప్పుడు ప్రధాని కన్ను తెలంగాణపై పడిందన్నారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే మనకు శ్రీరామరక్ష అని చెప్పారు. దత్తపుత్రిక పాదయాత్ర చేస్తూ అడ్డగోలుగా ఆరోపణలు చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణను కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అధికారులను జైల్లో పెట్టేలా అవినీతి చేసింది దత్త పుత్రిక కుటుంబం కాదా అని ప్రశ్నించారు. మళ్లి ఇక్కడకు వచ్చి నీతులు మాట్లాడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పట్టణ ప్రగతితో సుందరంగా మారుతున్న నగరాలు : ఎమ్మెల్యే కోరుకంటి

కరీంనగర్, డిసెంబర్ 2: ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమాం ద్వారా పట్టణాలు, నగరాలు అందంగా ముస్తాబవుతున్నాయని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం రామగుండం ఒకటవ డివిజన్‌లో రూ. 50 లక్షల పట్టణ ప్రగతి నిధులతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు చిరునామాగా నిలుస్తుందని పేర్కొన్నారు. గత పాలకుల హయాంలో పట్టణాలను ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల మురికి కూపాలుగా మారేవని ఆరోపించారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో అటు పల్లెలు, ఇట్టు పట్టణాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్ రావు , మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు, కార్పొరేటర్లు కన్నూరి సతీష్ కుమార్, సర్పంచ్ ధర్మాజీ కృష్ణ, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తిలో సింగరేణి రికార్డు.. 90.86 పీఎల్ఎఫ్‌తో నంబర్‌వన్

హైదరాబాద్, డిసెంబర్ 2: : సింగరేణి చరిత్ర సృష్టించింది. దేశంలోని 250కిపైగా ప్రభుత్వ, ప్రైవేటు థర్మల్ విద్యుత్తు కేంద్రాలన్నింటిలోనూ ఉత్పత్తిశాతంలో అగ్రస్థానం దక్కించుకొన్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో నవంబర్ వరకు అత్యధిక పీఎల్ఎఫ్(ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) సాధించిన థర్మల్ విద్యుత్తు కేంద్రంగా సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం(ఎస్టీపీపీ) నిలిచింది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) తాజా నివేదిక ప్రకారం ఎస్టీపీపీ అగ్రస్థానంలో ఉన్నది.

మంచిర్యాల జిల్లా బీమారం సమీపంలో 2016 ఆగస్టులో ఎస్టీపీపీ ప్రారంభమైంది. అప్పటి నుంచి మెరుగైన పీఎల్ఎఫ్‌తో దేశంలోని 25 అత్యుత్తమ ప్లాంట్ల జాబితాలో ఉంటున్నది. 2021-22లో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో జాతీయస్థాయిలో 88.97 పీఎల్ఎఫ్‌తో తొలిస్థానంలో, 2020-21లో రెండో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు థర్మల్ విద్యుత్తు కేంద్రాలన్నింటిలోనూ అగ్రస్థానంలో ఎస్టీపీపీ నిలిచింది. రెండో స్థానంలో ఛత్తీస్‌గఢ్‌లోని ఎన్టీపీసీ కోర్బా సూపర్ పవర్ థర్మల్ స్టేషన్ 90.01 పీఎల్ఎఫ్‌తో, ఎన్టీపీసీకే చెందిన సింగ్రౌలి థర్మల్ పవర్ ప్లాంట్ 89.94 పీఎల్ఎఫ్‌తో మూడో స్థానంలో నిలిచాయి.

800 మెగావాట్ల మూడో యూనిట్‌కు సీఎం కేసీఆర్ పచ్చజెండా

సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం ఇప్పటివరకు 51,547 మిలియన్ యూనిట్ల విద్యుత్తును రాష్ట్ర అవసరాలకోసం అందించింది. సింగరేణి ప్లాంట్ పురోగతిని ప్రశంసిస్తూ మరో 800 మెగావాట్లు (మూడో యూనిట్)ను నిర్మించేందుకు సీఎం కేసీఆర్ పచ్చజెండా ఊపారు. దీంతో సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ టెండర్ ప్రక్రియను వేగవంతం చేశారు. త్వరలో నిర్మాణ పనులు మొదలుకానున్నాయి. ఇప్పటికే 219 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను కూడా సింగరేణి ప్రారంభించింది. మూడో విడత 81 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటులో భాగంగా త్వరలో ఎస్టీపీపీ ఆవరణలోని నీటి రిజర్వాయర్‌లో 15 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌నుకూడా ఏర్పాటు చేయనున్నది.

పీఎల్ఎఫ్ అంటే..

ఒక విద్యుత్తు కేంద్రం స్థాపిత సామర్థ్యంలో ఎంత శాతం విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నదో చెప్పేదే పీఎల్ఎఫ్. వంద మెగావాట్ల ప్లాంటులో 75 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అయితే, దాని పీఎల్ఎఫ్‌ను 75% అని చెప్తారు. ఇప్పటివరకు ఎస్టీపీపీ నాలుగుసార్లు 100శాతం పీఎల్ఎఫ్ సాధించింది. 2018 సెప్టెంబర్, 2019 ఫిబ్రవరి, 2020 ఫిబ్రవరి, 2022 మార్చి నెలల్లో వందశాతం పీఎల్ఎఫ్ సాధించింది. ఈ ప్లాంట్‌లో 600 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లు ఉండగా.. మొదటి యూనిట్ 7 సార్లు, రెండో యూనిట్ 10 సార్లు 100శాతం పీఎల్ఎఫ్ సాధించాయి.

2026 నాటికి 3 వేల మెగావాట్లకుపైగా

1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేం ద్రంతో పాటు 2026 నాటికి పూర్తికానున్న 800 మెగావాట్ల మూ డో యూనిట్‌తో కలిపి 2 వేల మెగావాట్లకు విద్యుత్తు ఉత్పత్తి చేరుతుందని సీఎండీ ఎన్ శ్రీధర్ పేర్కొన్నారు. ప్రతిపాదిత 300 మెగావాట్ల సోలార్ విద్యుత్తుతోపాటు జలాశయాలపై ఏర్పాటుచేయనున్న 1000 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్తు ప్లాంట్లతో కలిపి 2026 నాటికి మొత్తం 3 వేల మెగావాట్లకుపైగా విద్యుత్తును ఉత్పత్తి చేసేస్థాయికి సింగరేణి చేరుకుంటుందని తెలిపారు. పీఎల్ఎఫ్‌లో ఎస్టీపీపీ జాతీయస్థాయిలో తొలిస్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో నూ ఇలాగే కృషిచేయాలని పిలుపునిచ్చారు.

ఎంబీబీఎస్ పీజీ మెడికల్ విద్యార్థులు జీన్స్ ప్యాంట్లు టీ షర్టులు ధరించకూడదు

-ఏపి రాష్ట్ర వైద్య విద్య డీఎంఈ సంచలన ఆదేశాలు

అమరావతి డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్)బి;ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఎంబీబీఎస్ పీజీ మెడికల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఇక నుంచి జీన్స్ ప్యాంట్లు టీ షర్టులు ధరించకూడదని రాష్ట్ర వైద్య విద్య సంచాలక కార్యాలయం (డీఎంఈ) సంచలన ఆదేశాలు జారీ చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు అసోసియేట్ ప్రొఫెసర్లు ప్రొఫెసర్లు వైద్య విద్యార్థి నులు.. చీర లేదా చుడీదార్లు మాత్రమే ధరించాలని ఏపీ డీఎంఈ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో జరిగిన వారాంతపు సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఈ ఆదేశాలను అన్ని బోధనాసుపత్రులకు పంపారు. తప్పని సరిగా ఈ డ్రస్ కోడ్ను పాటించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. నిర్దేశించిన డ్రస్ కోడ్ను కొందరు విద్యార్థినులు వైద్యులు పారామెడికల్ సిబ్బంది పాటించక పోవడాన్ని ఉన్నతాధికారులు గుర్తించా రని చెబుతున్నారు. ఇందులో భాగం గానే తప్పని సరిగా డ్రస్ కోడ్ను పాటిం చాలని ఆదేశాలు ఇచ్చారని తెలు స్తోంది. బోధనాసుపత్రులకు వచ్చే రోగులను ఇన్పేషంట్లుగా చేర్చుకోవాల్సి వస్తే.. సహాయకులు లేరని తిరస్కరిం చొద్దని డీఎంఈ సూచించింది. అలాగే ఫేస్ యల్ రికగ్నిషన్ అటెండెన్స్ (ముఖ ఆధారిత హాజరు) విధానాన్ని అమలు చేయాలని సూచించింది. ఈ మేరకు డీఎంఈ డాక్టర్ వినోద్కుమార్ బోధనా సుపత్రుల సూపరింటెండెంట్లు ప్రిన్సిపాళ్లకు ఆదేశాలిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ వైద్య విద్యా శాఖ ఆదేశాలు ఇవి..

-ఎంబీబీఎస్ పీజీ వైద్య విద్యార్థులు శుభ్రంగా ఉండే దుస్తులు వేసుకోవాలి.

- అబ్బాయిలు గడ్డం గీసుకోవాలి.

-మహిళలు జుట్టు వదిలేయ కూడదు.?

-తప్పనిసరిగా వైద్య విద్యార్థులంతా స్టెతస్కోప్ యాప్రాన్ను ధరించాలి. ఈ ఆదేశాలపై వైద్యులు వైద్య విద్యార్థులు వైద్య సంఘాలు ఎలా స్పందిస్తాయో వేచిచూడాల్సిందే. ఏపీ ప్రభుత్వం వైద్య విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. 26 జిల్లాలోనూ ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా డ్రస్ కోడ్ను అమల్లోకి తెచ్చింది.

విద్యార్థులకు ఆర్టీసీ మెరుగైన సేవలు

హైదరాబాద్, డిసెంబర్ 2: ప్రజలకు ముఖ్యంగా కళాశాలల విద్యార్థులకు మెరుగైన సేవలందించడానికి అవసరమైన రూట్లలో అదనంగా బస్సులను నడుపుతున్నట్లు చార్మినార్ ఆర్టీసీ డీఆర్ఎం విజయ్‌భాను అన్నారు. గురువారం మెహిదీపట్నం డిపోలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెహిదీపట్నం డిపో మేనేజర్ జి.వి.సూర్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ ఎం.కరుణా శ్రీలతో కలిసి వివరాలు వెల్లడించారు. డీఆర్ఎం డి.విజయ్‌భాను మాట్లాడుతూ.. మొయినాబాద్, శంకర్‌పల్లి రూట్లలో 14 పెద్ద కాలేజీలు ఉండటంతో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని ఎండీ ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే శంకర్‌పల్లి రూట్లో 17 ట్రిప్పులు, మొయినాబాద్ రూట్లో 24 ట్రిప్పులు బస్సులు నడుస్తున్నాయన్నారు. ఎండీ ఆదేశాలతో మొయినాబాద్, శంకర్‌పల్లి రూట్లలో సర్వే నిర్వహించి బస్సుల సంఖ్యను పెంచాలని నిర్ణయించామని, ఈ మేరకు ఫలక్‌నుమా, ఫరూక్‌నగర్, బర్కత్‌పురా, ముషీరాబాద్ డిపోల నుంచి రెండు చొప్పున బస్సులను నడుపడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు రద్దీగా ఉన్న సమయంలో ఈ బస్సులను వెహిదీపట్నం రైతుబజార్ వద్దకు పంపి విద్యార్థులకు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. అక్కడ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా బస్సులు ఎక్కే విధంగా డిపో మేనేజర్‌ను, అసిస్టెంట్ మేనేజర్‌ను, ఇద్దరు సెక్యూరిటీ గార్డులను పెట్టి బస్సుల్లో విద్యార్థులు సాఫీగా ప్రయాణించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా కాంబో టికెట్‌ను రూ.20 నుంచి రూ.10లకు తగ్గించామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వివాదాలు లేకుండా పోలీసు సొసైటీలు నిర్వహించాలి

హైదరాబాద్, డిసెంబర్ 2: పోలీస్ కో ఆపరేటివ్ సొసైటీని ఎలాంటి వివాదాలకు తావు లేకుండా నడపాలని, పోలీసు పిల్లలు సివిల్ సర్వీస్, గ్రూప్‌లలో మంచి ఉద్యోగాలు సాధించే విధంగా నిరంతరం ప్రోత్సహించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ సిబ్బందికి సూచించారు. అలాగే, స్పోర్ట్స్‌తో పాటు మంచి పౌరులుగా వారిని తీర్చిదిద్దాలన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పోలీసు కో ఆపరేటివ్ సొసైటీ మొదటి సర్వసభ్య సమావేశం గురువారం కమిషనరేట్ కార్యాలయంలో జరిగింది.

ఈ సమావేశానికి సీపీ మహేశ్ భగవత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడిగా సీపీ సొసైటీ సర్టిఫికెట్‌ను ఆవిష్కరించగా, సొసైటీ ఉపాధ్యక్షులుగా అదనపు డీసీపీ నర్మ లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ ఏసీపీ జావెద్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు భద్రారెడ్డి, జాయింట్ సెక్రటరీ వెంకటయ్య, కృష్ణారెడ్డి, కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రాచకొండ పోలీసు కమిషనరేట్ కార్ హెడ్ క్వార్టర్స్‌లో ఎం.టీ విభాగంలో రూ. 8 లక్షలతో మరమ్మతులు చేసిన మెకానికల్ షెడ్‌ను సీపీ మహేశ్ భగవత్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఐదు నెలల పాటు సాగిన బ్రాస్ బాండ్ ట్రైనింగ్ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, రాచకొండ బ్యాండ్ సభ్యులకు బహుమతి అందజేశారు.

ఇండియన్ జర్నల్ ఆఫ్ బయోకెమిస్ట్రీ అండ్ బయోఫిజిక్స్ (ఐజెబిబి), సిఎస్ఐఆర్-నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ పాలసీ రీసెర్చ్ (ఎన్ఐఎస్సిపిఆర్)

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: ఇండియన్ జర్నల్ ఆఫ్ బయోకెమిస్ట్రీ అండ్ బయోఫిజిక్స్ (ఐజెబిబి), సిఎస్ఐఆర్-నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ పాలసీ రీసెర్చ్ (ఎన్ఐఎస్సిపిఆర్), న్యూఢిల్లీ ,డిసెంబర్ 2022 సంచిక , "నానో మెడికల్ సైన్సెస్ లో ఇటీవలి అభివృద్ధి (ఆర్ఎఎన్ఎంఎస్ -2022)" అనే ఇతివృత్తంపై ప్రత్యేక సంచిక. ఇన్స్టిట్యూట్ ఆఫ్ నానో మెడికల్ సైన్సెస్ (ఐఎన్ఎంఎస్), ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ (ఐఓఈ), యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ, కిరోరి మాల్ కాలేజ్ సహకారంతో డీబీటీ స్టార్ కాలేజ్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక సంచికను ప్రచురిస్తున్నారు. సిఎస్ఐఆర్-ఎన్ఐఎస్సిపిఆర్, భారత దేశంలో ఒక ప్రముఖ పబ్లిక్ ఫండెడ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ పాలసీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, వివిధ ఎస్ టి ఐ విభాగాలలో 16 జర్నల్స్ ను ప్రచురిస్తోంది.

వాటన్నిటినీ సైన్స్ సైటేషన్ ఇండెక్స్ (వెబ్ ఆఫ్ సైన్స్), స్కోపస్, ఎన్ఎఎస్ , యుజిసి కేర్ వం టి ప్రఖ్యాత జాతీయ / అంతర్జా తీయ ఏజెన్సీలు ఇండెక్స్ చేశాయి.

బయోకెమిస్ట్రీ, బయోఫిజిక్స్ , బయోటెక్నాలజీ సబ్జెక్ట్ ఏరియాలో నెలవారీ ప్రీమియర్ పీర్-రివ్యూడ్ రీసెర్చ్ జర్నల్ అయిన ఐజెబిబి, 1.472 స్కోరుతో, అన్ని విభాగాల్లోని సిఎస్ఐఆర్-ఎన్ఐఎస్సిపిఆర్ జర్నల్స్ లో మొదటి స్థానంలో ఉంది. ప్రఖ్యాత జాతీయ/ అంతర్జాతీయ నిపుణులతో ఇటీవల పునర్వ్యవస్థీకరించిన ఎడిటోరియల్ బోర్డు సమర్థవంతమైన మార్గదర్శకత్వం, క్రియాశీల మద్దతుతో, ఈ జర్నల్ ప్రపంచవ్యాప్తంగా బయోకెమిస్ట్రీ, బయోఫిజిక్స్ ,బయోటెక్నాలజీ రంగంలో పరిశోధకులు విద్యావేత్తల నుండి గణనీయమైన దృష్టిని పొందుతోంది.

ఇటువంటి ప్రత్యేక సంచికలు జర్నల్ కు ఔట్ రీచ్ లో సేవలు అందించడమే కాకుండా, దాని నెట్ వర్క్ ని విస్తరించడమే కాకుండా, వివిధ భాగస్వాముల మధ్య దాని ప్రభావాన్ని కూడా పెంచుతాయి.

2022 జూన్ 22-23 మధ్య ఐఎన్ఎంఎస్ , ఐఐఇ నిర్వహించిన శతాబ్ది సంవత్సరం కాన్ఫరెన్స్ ఆర్ ఎ ఎన్ ఎం ఎస్ -2022 రాన్స్-2022 యొక్క ఉత్పాదక ఫలితంగా వెలువడిన ఈ ప్రత్యేక సంచిక, నానో మెడికల్ సైన్సెస్ లో ఇటీవలి పురోగతి పై ఏడు సమీక్షా వ్యాసాలు మూడు వాస్తవ పరిశోధనా పత్రాలతో 97 పేజీల నాణ్యమైన సమాచారాన్ని కలిగి ఉంది.

సమీక్షా వ్యాసాలు -ఫోరెన్సిక్ సైన్స్ లో నానోటెక్నాలజీ, పర్యావరణ కాలుష్యంలో నానోపార్టికల్స్ ద్వారా రెమిడియేషన్, ఇంజినీరింగ్ చేయబడ్డ నానోపార్టికల్స్ నానోటెక్నాలజీ జోక్యాలు; నానోమెటీరియల్స్ ఇమ్యునోమోడ్యులేటరీ పొటెన్షియల్, క్వాంటం చుక్కల సంశ్లేషణ; మొదలైన వ్యాక్సిన్ , ఇమ్యునాలజీలో నానోపార్టికల్స్ అనువర్తనాలు , సవాళ్లను క్లుప్తంగా కవర్ చేస్తాయి; వాస్తవ పరిశోధనా వ్యాసాలు ఐరన్ నానో పార్టికల్స్ సిల్వర్ నానోపార్టికల్స్ బయోఫ్యాబ్రికేషన్ , ఆప్టిమైజేషన్; నానోమెటీరియల్స్ మాదిరి జింక్ ఆక్సైడ్ అనువర్తనాలు, సవాళ్లు మొదలైన యాంటీమైక్రోబయల్ యాక్టివిటీ గురించి చర్చిస్తాయి;

న్యూఢిల్లీలోని సిఎస్ఐఆర్-ఎన్ఐఎస్సిపిఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రంజనా అగర్వాల్, ఐ జె జె బి చీఫ్ ఎడిటర్ డాక్టర్ స్టీఫెన్ దిమిత్రోవ్, ఐ జె జె బి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ డాక్టర్ డి ఎన్ రావు, సీనియర్ సహోద్యోగులు శ్రీ ఆర్ ఎస్ జయ సోము , డాక్టర్ జి మహేష్ (హెడ్, రీసెర్చ్ జర్నల్స్) , ఐ జె బి బి సీనియర్ సైంటిస్ట్ ,సైంటిఫిక్ ఎడిటర్ డాక్టర్ ఎన్.కె.ప్రసన్న తీసుకున్న చొరవ, రచయితలు, సమీక్షకులు అందించిన వ్యాసాలు , సిఎస్ఐఆర్-ఎన్ఐఎస్సిపిఆర్ ప్రింట్ ప్రొడక్షన్ టీమ్ అందించిన సాంకేతిక సహకారంతో ఈ ప్రత్యేక సంచికను తీసుకువచ్చారు.

ఉద్యోగాల కోతకు సిద్ధమైన షేర్‌చాట్.. స్పోర్ట్స్ యాప్‌ను మూసివేయనున్న సంస్థ

హైదరాబాద్, డిసెంబర్ 2: ఉద్యోగులను తొలగిస్తున్న సోషల్ మీడియా సంస్థల జాబితాలో షేర్‌చాట్ కూడా చేరింది. ఫాంటసీ స్పోర్ట్స్ యాప్ జీత్11ను నిలిపివేస్తున్నట్టు ఈరోజు ప్రకటించింది. దాంతో, 5 శాతం మంది ఉద్యోగులను తొలగించనుంది. అంటే దాదాపు 100 మంది ఉద్యోగాలు కోల్పోనున్నారు. 'భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న సోషల్‌మీడియా సంస్థగా నిలిచేందుకు ఎప్పటికప్పుడు మా ప్రణాళికల్ని బేరీజు వేసుకుంటాం. మా లక్ష్యాన్ని చేరుకునేందుకు అవసరమైన మార్పులు చేస్తాం. అందులో భాగంగానే జీత్ 11 యాప్ సేవల్ని నిలిపివేస్తున్నాం. కొందరిని ఇతర విభాగాల్లోకి తీసుకుంటున్నాం. మరికొందరిని ఉద్యోగం నంచి తొలగిస్తున్నాం. జీత్ 11 యాప్ నిలిపివేత ప్రభావం 5 శాతం కంటే తక్కువ మంది ఉద్యోగులపై పడనుంది' అని షేర్‌చాట్ ఒక ప్రకటనలో వెల్లడించింది.

బెంగళూరుకు చెందిన అంకుశ్ సచ్‌దేవ, భాను ప్రతాప్ సింగ్, ఫరీద్ హసన్‌లు 2015లో షేర్‌చాట్‌ను ప్రారంభించారు. షేర్‌చాట్ మోజ్, మోజ్ లైట్ ప్లస్ వంటి అప్లికేషన్స్ తెచ్చారు. ఈ సంస్థలో ప్రస్తుతం 2,300 మంది పనిచేస్తున్నారు. ఐదు నెలల క్రితం గూగుల్, టైమ్స్ గ్రూప్, టెమసెక్ వంటి సంస్థలు షేర్‌చాట్‌లో 230 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చాయి. నేపథ్యంలో షేర్‌చాట్ ఉద్యోగుల తొలగింపు నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి స్టార్టప్ కంపెనీలు ఉద్యోగాల్లో కోత విధిస్తున్నాయి. ఇప్పటివరకూ 16వేల మందిని ఇంటికి పంపించి వేశాయి

లేక్ వ్యూ రెస్టారెంట్‌ను ప్రారంభించిన సీఎం జగన్

అమరావతి: డిసెంబర్ 2: వైఎస్సార్ జిల్లా లింగాల మండలం, పార్నపల్లి గ్రామ సమీపంలో ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో పర్యాటకులను ఆకర్షించే విధంగా రూ. 4.1 కోట్లతో నిర్మించిన లేక్ వ్యూ రెస్టారెంట్, పార్కును, రూ. 1.5 కోట్లతో ఏర్పాటు చేసిన బోటింగ్, జెట్టీలను ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఇందులో పాంటున్ బోటు (15 కెపాసిటీ),డీలక్స్ బోట్ (22కెపాసిటీ), 6 సీటర్ స్పీడ్ బోట్ ,4 సీటర్ స్పీడ్ బోట్ లు ఉన్నాయి. అలాగే పర్యాటకుల భద్రతా చర్యల్లో భాగంగా స్టేట్ డిసాస్టర్ రిస్క్యూ (ఎస్డిఆర్) బోట్, ఫైర్ సర్వీస్ బోట్ లను, లైఫ్ జాకెట్లను అందుబాటులో ఉంచారు. అలాగే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. లేక్ వ్యూ పాయింట్ వద్ద నుండి రిజర్వాయర్ అందాలను తిలకించారు. ముందుగా చిత్రావతి రిజర్వాయర్ లో పాంటున్ బోటులో ముఖ్యమంత్రి కాసేపు విహరించారు. చిత్రావతి లేక్ వ్యూ ప్రకృతి అందాలను ఆయన తిలకించారు. ముఖ్యమంత్రితో పాటు బోటులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి అంజాద్ బాషా, కడప పార్లమెంట్ సభ్యులు అవినాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, ఎస్పీ అన్బు రాజన్, సీఎం సెక్రటరీ ధనుంజయ రెడ్డి, ఓ.ఎస్.డి సీ.ఎం.ఓ కృష్ణమోహన్ రెడ్డి, టూరిజం ఎండి కన్నబాబు, పాడ అనిల్ కుమార్ రెడ్డి, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి రెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య

అమరావతి: డిసెంబర్ 2: ఏపీలోని నంద్యాల జిల్లాలో ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని నంద్యాల త్రీ టౌన్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామకృష్ణ స్టేషన్‌లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రామకృష్ణ ఇటీవల ఆళ్లగడ్డ నుంచి నంద్యాల త్రీటౌన్ పీఎస్‌కు బదిలీపై వచ్చాడు. ఆత్మహత్యకు కుటుంబ సమస్యలా, పని ఒత్తిడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు.

పరిపాలన అంశాలు సమర్థవంతంగా సాగాలి

హైదరాబాద్, డిసెంబర్ 2: : పరిపాలన అంశాలను సమర్థవంతంగా కొనసాగించాలని మేడ్చల్ జిల్లా అదన పు కలెక్టర్ అభిషేక్ అగస్త్య కొంపల్లి మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. గురువారం కొంపల్లి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి నిర్మాణాలతో పాటు సమస్యలపై సందర్శించి.. పరిశీలించారు. కొంపల్లి బ్రిడ్జి నుంచి సుచిత్ర చౌరస్తా వరకు సాగుతున్న ఎన్‌హెచ్-44 జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఏమాత్రం అలసత్వం వహించారాదని, దీనికితోడు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణాలు సాఫీగా సాగేలా తగు చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులకు పలు సూచన లు ఇచ్చారు.

అనంతరం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్‌తో పాటు ఇతర సమస్యలను పరిశీలించి, మ రింత మెరుగ్గా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ శ్రీహరికి సూచించారు. దూలపల్లి ఫారెస్టు అకాడమీకి సంబంధించిన రెండెకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం నివేదికలను తయారు చేయాలని, దీంతో పాటు దూలపల్లి శ్మశానవాటిక అభివృద్ధి కి మరో టెండర్ కోసం ప్రణాళికలను సిద్ధం చేయాలని సూ చించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, వైస్ చైర్మన్ రత్నావత్ గంగయ్యనేతృత్వంలో అదనపు కలెక్టర్‌ను సన్మానించి మొక్కను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కార్యాలయం ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యుదయ రచయితల సంఘం (గుంటూరు జిల్లా శాఖ)

ఆహ్వానము

చలపాక ప్రకాష్ 'కరోనా నానీలు' హిందీ అనువాదం

कोरोना का कोहराम

కరోనా కా కొహరామ్ ఆవిష్కరణ

తేది: 10 డిసెంబర్ 2022 శనివారం సాయంత్రం 6

పోలీస్ కిష్టయ్య త్యాగం మరువలేనిది

హైదరాబాద్, డిసెంబర్ 2: : తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ కిష్టయ్యను యావత్ తెలంగాణ ప్రజానీకం మరువదని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. గురువారం ఖిలావరంగల్ పడమర కోటలోని చమన్ దగ్గర మాజీ కార్పొరేటర్, ముదిరాజ్ మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బయ్య స్వామి అధ్యక్షతన మలిదశ ఉద్యమంలో అమరుడైన కిష్టయ్య 13వ వర్ధంతి సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తెలంగాణ అమరవీరుల స్తూపంపై పూలు చల్లి పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కోసం అమరుడైన కిష్టయ్య కుటుంబానికి ప్రభుత్వం ఉద్యోగం, ఆర్థికసాయం చేసి అండగా నిలిచిందన్నారు.

తెలంగాణ కోసం ప్రాణత్యాగాలు చేసిన కుటుంబాలను సీఎం కేసీఆర్ ఆదుకున్నారని గుర్తుచేశారు. ముదిరాజ్‌ల కోసం ప్రభుత్వం సొసైటీలను ఏర్పాటు చేసి సబ్సిడీలను అందజేస్తున్నదన్నారు. 67 ఏండ్లలో సమైక్య పాలకులు కులవృత్తులకు అన్యాయం చేశారని చెప్పారు. రాజకీయాలు ముఖ్యం కాదని, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే మా ఎజెండా అని అన్నారు. అద్భుతమైన సూపర్ స్పెషాలిటీ దవాఖానను నిర్మిస్తున్నామని, నియోజకవర్గంలో ఏడు గురుకులాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎదగాలనే సంకల్పంతోనే మడమ తిప్పకుండా కొనసాగుతున్నామన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు పనిగట్టుకొని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలిపారు. కరోనా కష్టకాలంలో ప్రజల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేశామని, అన్నివేళల్లో మీకు తోడుగా ఉండి మీ అభివృద్ధికి బాటలు వేస్తానని చెప్పారు.

కార్యక్రమంలో 37,38వ డివిజన్ కార్పొరేటర్లు బోగి సువర్ణ-సురేశ్, బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్ దంపతులు, 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్, ముదిరాజ్ నాయకులు చింతాకుల సునీల్, సంగరబోయిన చందర్, సంగరబోయిన విజయ్, అభిలాశ్, రావుల రాజేశ్, బొల్ల సుజాత, సిరబోయిన శ్రీనివాస్, సోమేశ్వర్, మధు, రాజేశ్, జనార్దన్, బంగారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మి మెగా టౌన్‌షిప్ యాజమానులు నూతనంగా ఎన్నుకున్న ప్యానెల్ సభ్యులు, కార్పొరేటర్ కావటి కవిత-రాజుయాదవ్ గురువారం శివనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నరేందర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ప్యానెల్ అధ్యక్షుడిగా నేలకుర్తి కరుణాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా కొడకండ్ల రామచంద్రమూర్తి, కోశాధికారిగా బంక సుదర్శన్, గౌరవ అధ్యక్షుడిగా గజ్జి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లడే సురేశ్, ఉపాధ్యక్షులుగా దుగ్యాల శ్రీనివాసరావు, నారపాక దేవిడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆడెపు సురేశ్, పింగిలి సదానందం, గౌరవ సలహాదారులుగా డాక్టర్ గజ్జెల సుధాకర్, శరత్, సంయుక్త కార్యదర్శులుగా గొలుసుల సదానందం, దుర్గనాల బాబురావు, జాయింట్ ట్రెజరర్లుగా కొనిశెట్టి రాము, తొగిడి ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా మాలి బాబూరావు, పెండ్యాల సంపత్ ఎన్నికయ్యారు. కాగా, ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు తినిపించారు. అనంతరం కాలనీ సమస్యలను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పేదల పట్ల బీజేపీది మొసలి కన్నీరు..

ఒడిశా సీఎం ధ్వజం

భువనేశ్వర్, డిసెంబర్ 2: ఒడిశా రాష్ట్రంలోని పేదల పట్ల బీజేపీ మొసలి కన్నీరు కారుస్తుందని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ధ్వజమెత్తారు. బీజేపీ నాయకులు అబద్ధాలాడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

పదంపూర్ నియోజకవర్గానికి డిసెంబర్ 5వ తేదీన ఉప ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో జార్భుంద్, పైక్మాల్ బ్లాకుల్లో బీజేడీ నిర్వహించిన సభల్లో సీఎం నవీన్ పట్నాయక్ పాల్గొని ప్రసంగించారు. 2019 నుంచి జరిగిన ఉప ఎన్నికల ప్రచారంలో నవీన్ పట్నాయక్ పాల్గొనడం ఇదే మొదటిసారి.

బీజేపీని టార్గెట్ చేసి మాట్లాడిన నవీన్ పట్నాయక్ తన ప్రసంగాన్ని జై నృసింగనాథ్‌తో ప్రారంభించారు. జై నృసింగనాథ్ స్థానికులకు ఇష్టమైన దేవుడు. అయితే పేదల పట్ల బీజేపీ మొసలి కన్నీరు కారుస్తుందని మండిపడ్డారు నవీన్ పట్నాయక్. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఐదు లక్షల ఇండ్ల నిర్మాణం పూర్తి చేసినందుకు గానూ కేంద్రం నుంచి తమకు అవార్డు వచ్చిందని సీఎం గుర్తు చేశారు.

కానీ బీజేపీ ఎంపీలు రాజకీయంగా తనకు గుర్తింపు రావొద్దనే ఉద్దేశంతో.. పీఎం ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి వచ్చే ఇండ్లను ఆపారని పేర్కొన్నారు. ఈ స్కీంను రాష్ట్రంలో అమలు కానివ్వకుండా అడ్డుకున్నారని తెలిపారు. దీని వల్ల రెండేండ్లలో 10 లక్షల మంది ఇండ్లు కోల్పోయారని పేర్కొన్నారు.

కెందూ ఆకు వ్యాపారం చేసుకునే రైతులపై కేంద్రం జీఎస్టీ అధికంగా విధిస్తుందని తెలిపారు. బంగారంపైన మూడు శాతం జీఎస్టీ విధిస్తే, రైతులు వ్యాపారం చేసుకునే కెందూ ఆకుపై 18 శాతం జీఎస్టీ విధించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. చివరకు రైతులను కూడా కేంద్రం వదిలిపెట్టడం లేదని నవీన్ పట్నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని స్థానిక ప్రజలకు సీఎం సూచించారు. పదంపూర్ నియోజకవర్గం అభివృద్ధి కేవలం బీజేడీతోనే సాధ్యమవుతుందని పట్నాయక్ స్పష్టం చేశారు.



ఘనీభవించిన (ఫ్రోజెన్) చేపలు, మత్స్య ఉత్పత్తుల అమ్మకాలు ఎక్కువ చేయడానికి వెబినార్ నిర్వహించిన మత్స్య శాఖ

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలో భాగంగా "ఘనీభవించిన చేపలు మరియు చేపల ఉత్పత్తులను ప్రోత్సహించడం" అనే అంశంపై కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖలు 2022 నవంబర్ 29న జాతీయ వెబ్‌నార్‌ను నిర్వహించాయి. మత్స్య శాఖ కార్యదర్శి శ్రీ జతీంద్ర నాథ్ స్వైన్ అధ్యక్షతన జరిగిన వెబినార్ లో పారిశ్రామికవేత్తలు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు, వివిధ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల మత్స్య శాఖ అధికారులు , రాష్ట్ర వ్యవసాయం, వెటర్నరీ మరియు మత్స్య విశ్వవిద్యాలయాల అధ్యాపక సిబ్బంది, మత్స్య పరిశోధనా సంస్థలు, మత్స్య సహకార అధికారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు మరియు దేశవ్యాప్తంగా మత్స్య పరిశ్రమ నుంచి వాటాదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ సంయక్త కార్యదర్శి శ్రీ సాగర్ మెహ్రా తన స్వాగత ఉపన్యాసంలో మత్స్య శాఖ అమలు చేస్తున్న ప్రధాన కార్యక్రమం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ప్రాధాన్యత అమలు జరుగుతున్న తీరు, మత్స్య రంగం ప్రస్తుత పరిస్థితిని వివరించారు. అట్టడుగు వర్గాలకు పోషకాహారం అందించడానికి, దేశంలో చేపల వినియోగాన్ని ఎక్కువ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.ప్రపంచ మత్స్యమార్కెట్‌లలో అనిశ్చితి ఏర్పడినప్పుడు తలెత్తే పరిస్థితిని ఎదుర్కోవడానికి దేశీయంగా చేపల వినియోగాన్ని పెంపొందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భారతదేశం రిస్క్ మిటిగేషన్ ప్లాన్ రూపొందిందని అన్నారు.

వెబినార్ లో మత్స్య శాఖ కార్యదర్శి శ్రీ జతీంద్ర నాథ్ స్వైన్ ముఖ్య ఉపన్యాసం ఇచ్చారు. చేపలు తింటున్న వారి సంఖ్య పెంచడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ముఖ్యంగా ఘనీభవించిన చేపలు మరియు మత్స్య ఉత్పత్తుల విక్రయానికి ఎక్కువ చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఘనీభవించిన చేపలు మరియు చేపల ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకుని రావడానికి అమలు చేస్తున్న ప్రణాళికను ఆయన ప్రస్తావించారు. వినియోగదారుల విశ్వాసాన్ని పెంపొందించడానికి ఎగుమతి చేస్తున్న మత్స్య సంపద విషయంలో అమలు చేస్తున్న నాణ్యతా ప్రమాణాలను ఘనీభవించిన చేపలు మరియు చేప ఉత్పత్తులకు అమలు చేయాలని అన్నారు. అవసరమైన లేబులింగ్, ధృవపత్రాలతో దేశీయ మార్కెట్‌కు విస్తరించాలని ఆయన సలహా ఇచ్చారు. అదనంగా,పట్టణ ప్రాంతాలు , సెమీ-అర్బన్ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లో మరియు వినియోగదారుల సంఖ్యను పెంచడానికి ఇతర ఉత్పత్తుల సరఫరాకు ఉపయోగిస్తున్న వ్యవస్థ ద్వారా ఘనీభవించిన చేపలు మరియు చేప ఉత్పత్తులను సరఫరా చేయడానికి గల అవకాశాలను అన్వేషించాలని సూచించారు. సాంకేతిక అంశాలపై జరిగిన కార్యక్రమంలో పరిశ్రమ నిపుణులు శ్రీ. జీఎస్ రత్ (సీనియర్ జనరల్ మేనేజర్, సేల్స్ మార్కెటింగ్, ఫాల్కన్ మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్), శ్రీ ఏజే తారకన్ (చైర్మన్, అమాల్గామ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్), మరియు శ్రీ మాథ్యూ జోసెఫ్ (ఫ్రెష్ టు హోమ్ సీఈవో) తదితరులు మార్కెట్ పరిస్థితులు , వినియోగదారుల అభిరుచులు మరియు ఘనీభవించిన చేపలు మరియు చేపల ఉత్పత్తులను ప్రాసెస్ చేయడానికి ఉపయోగించే సాంకేతిక అంశాలపై ప్రసంగించారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితి మరియు సాంకేతికతలపై జరిగిన చర్చలో నిపుణులు తాజా చేపలతో పోలిస్తే ఘనీభవించిన చేపలు తినడానికి ఎక్కువ మంది ఇష్టపడక పోవడం, సరఫరా వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, వినియోగదారు మార్కెట్‌లో ఘనీభవించిన చేపలు మరియు చేపల ఉత్పత్తులు తక్కువగా లభించడం లాంటి అంశాల వల్ల క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను కూడా నిపుణులు ప్రస్తావించారు.

మార్కెట్ విస్తరణకు గల అవకాశాలు, అమ్మకాలు ఎక్కువ చేయడానికి అమలు చేయాల్సిన వ్యూహాలను నిపుణులు సిఫార్సు చేశారు. వినియోగదారు ఘనీభవించిన చేపలు మరియు చేపల ఉత్పత్తుల మార్కెట్ అభివృద్ధి చేయడం లాంటి అంశాలను నిపుణులు వివరించారు. పారదర్శకత ధర, , నాణ్యత మరియు వ్యాపార సౌలభ్యం కోసం క్రమబద్ధీకరించబడిన ప్రక్రియలను తీసుకురాగల చేపల మార్కెట్లను నిర్వహించడం గురించి విధానాలు అభివృద్ధి చేయడానికి గల అవకాశాలు వివరించారు.

పారిశ్రామిక విధానాలపై నిపుణులు ప్రదర్శించిన వీడియోలు, ప్రశ్నలకు ఇచ్చిన జవాబులు వెబ్‌నార్‌ను విజయవంతం చేశాయి. కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసే అంశంపై కూడా చర్చలు జరిగినాయి. మరియు ఓపెన్ ఫోరమ్‌లో తీసుకున్న ప్రశ్నలు సెషన్‌ను ఇంటరాక్టివ్‌గా మరియు ఫలవంతమైనవిగా చేశాయి. సెక్టోరల్ స్ట్రాటజీలు మరియు యాక్షన్ ప్లాన్‌లను మరింత అభివృద్ధి చేయడానికి అంతర్దృష్టితో కూడిన చర్చల నుండి ఫాలో-అప్ యాక్షన్ పాయింట్‌లు కూడా వచ్చాయి. మత్స్య శాఖ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఎస్ కె ద్వివేది వందన సమర్పణ చేశారు.

న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద గల నేతాజీ సుభాష్ చంద్ర బోస్ విగ్రహం (కర్తవ్యపథ్) సమీపంలోని స్వామి వివేకానంద రోడ్డులో ఈనెల 7వరకు దివ్య కళా మేళా

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద గల నేతాజీ సుభాష్ చంద్ర బోస్ విగ్రహం (కర్తవ్యపథ్) సమీపంలోని స్వామి వివేకానంద రోడ్డులో 02 నుంచి 07 డిసెంబర్, 2022 వరకు దేశం నలుమూలల నుంచి వచ్చిన దివ్యాంగ వ్యవస్థాపకులు/ హస్తకళాకారుల ఉత్పత్తులను, నైపుణ్యాలను ప్రదర్శించే విశిష్ట కార్యక్రమం దివ్య కళా మేళాను విభాగం నిర్వహిస్తోంది. జమ్మూ, కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు సహా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన హస్తకళలు, చేనేత, ఎంబ్రాయిడరీ, ప్యాకేజ్డ్ ఆహారం తదిరాల ఒక చోట చూడడం అన్నది వచ్చినవారికి మనోహరమైన అనుభవాన్ని ఈ ప్రదర్శన అందించనుంది.

దాదాపు 22 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 200మంది దివ్యాంగ హస్తకళాకారులు/ కళాకారులు, వ్యవస్థాపకులు తమ ఉత్పత్తులను, నైపుణ్యాలను ప్రదర్శించనున్నారు. దిగువన పేర్కొన్న వర్గాల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి - ఇంటి అలంకరణ ద జీవనశైలి, వస్త్రాలు, స్టేషనరీ, పర్యావరణ అనుకూల ఉత్పత్తులు, ప్యాకేజ్ ఆహారం, ఆర్గానిక్ ఉత్పత్తులు, బొమ్మలు ద కానుకలు, వ్యక్తిగత ఉపకరణాలైన నగలు, క్లచ్ బ్యాగ్స్ వంటివి అందుబాటులో ఉంటాయి. ఇది అందరూ, స్థానికం కోసం గళమెత్తేందుకే కాక దివ్యాంగ హస్తకళాకరులు చేసిన ఉత్పత్తులను మరింత పట్టుదలతో చూసేందుకు/ కొనుగోలు చేసేందుకు మంచి అవకాశం.

ఆరురోజుల పాటు సాగే దివ్యకళా మేళ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు తెరిచే ఉండడమే కాక, దివ్యాంగ కళాకారులు, ప్రముఖ కళాకారుల ప్రదర్శనలు సహా అనేక సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించవచ్చు. సందర్శకులు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన తమకు ఇష్టమైన ఆహారాన్ని కూడా ఈ కార్యక్రమంలో ఆస్వాదించవచ్చు.

ఈ కార్యక్రమాన్ని 02 డిసెంబర్ 2022న, అనగా రేపు సాయంత్రం 4.00 గంటలకు కేంద్ర సామాజిక న్యాయండ సాధికారత మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయమంత్రులు శ్రీ రామదాస్ అథావలే, ప్రతిమా భౌమిక్ కూడా హాజరుకానున్నారు.

ఈ భావనను ప్రోత్సహించేందుకు విభాగం భారీ ప్రణాళికలను కలిగి ఉంది. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం దివ్య కళా మేళాను నిర్వహించడమే కాక దీనిని ఢిల్లీకి మాత్రమే పరిమితం చేయకుండా దేశవ్యాప్తంగా చేపట్టనున్నారు.

ప్రపంచ సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించాలి

హైదరాబాద్, డిసెంబర్ 2: ప్రస్తుత రోజుల్లో ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఎదుర్కోబోయే సమస్యలను కూడా తెలుసుకోగలగాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ భూగోళ శాస్త్ర విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ జాగ్రఫర్స్ (ఐఐజీ) సంయుక్తంగా ఐఐజీ 43వ వార్షిక సమావేశాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా 'చాలెంజెస్ ఆఫ్ ఫ్యూచర్ ఎర్త్ ? సోషల్, ఎకనామిక్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సస్టెయినబిలిటీ' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును ఓయూలోని వీజీఆర్ఆర్‌సీడీ ఈ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు.

ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ లింబాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) 2030 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ఒకటైన అంశంపై సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. భూపరిరక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి కార్యక్రమాలను చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌కాయిన్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసకుమార్, ప్రముఖ శాస్త్రవేత్త, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైవీఎన్ కృష్ణమూర్తి, ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, ఐఐజీ సెక్రటరీ ప్రొఫెసర్ రవీంద్ర జయబేయి, సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ బాలకిషన్, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ శ్రీనగేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ మహ్మద్ అక్తర్ అలీ పాల్గొన్నారు.

మొయిన్‌పురి ఉప ఎన్నికలో కాషాయ పార్టీని మట్టికరిపిస్తాం : అఖిలేష్ యాదవ్

లక్నో, డిసెంబర్ 2: మొయిన్‌పురి లోక్‌సభ ఉప ఎన్నికలో కాషాయ పార్టీని మట్టికరిపించి ఘన విజయం సాధిస్తామని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ) చీఫ్, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మొయిన్‌పురిలో బీజేపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతోందని ఆరోపించారు.ఈ ఎన్నికలో గెలుపొంది ములాయం సింగ్ యాదవ్‌కు నివాళి అర్పిస్తామని అఖిలేష్ పేర్కొన్నారు. ఎస్‌పీ వ్యవస్థాపకుడు ములాయం మరణంతో మొయిన్‌పురి లోక్‌సభ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎస్‌పీ కంచుకోట మొయిన్‌పురిని నిలుపుకునేందుకు ఆ పార్టీ సర్వశక్తులు ఒడ్డుతోంది. ఎస్‌పీ అభ్యర్థిగా డింపుల్ యాదవ్ బీజేపీ అభ్యర్థి రఘురాజ్ సింగ్ సఖ్యతో ద్విముఖ పోరులో తలపడుతున్నారు. మొయిన్‌పురిలో తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు పాలక బీజేపీ చెమటోడుస్తోంది.

ఐతం వెంకటేశ్వరరావు పాడే మోసిన మల్లు భట్టి విక్రమార్క

ఖమ్మం, డిసెంబర్ 2 : (నేటినిజం ప్రతినిధి): స్వాతంత్ర సమరయోధులు కాంగ్రెస్ నాయకులు ఐతం వెంకటేశ్వరరావు మృతి పట్ల తీవ్రగ్రాంతి చెందిన మధిర శాసనసభ్యులు, శాసనసభ పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క హుటా హుటిన ఢిల్లీ నుంచి ఖమ్మం చేరుకొని ఐతం వెంకటేశ్వరరావు పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఐతం వెంకటేశ్వరరావు తన గురువుతో సమానమని మొదటి నుంచి తనకు తోడుగా ఉన్నారని జ్ఞాపకాలు గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఐతం వెంకటేశ్వరరావు అంతిమయాత్రలో పాల్గొని పాడెను మోసి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఈ అంతిమయాత్రలో ఏ కె. రామారావు, పొట్ల నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పుచ్చకాయల వీరభద్రం, మిక్కిలినేని నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధులు కాంగ్రెస్ నాయకులు ఐతం వెంకటేశ్వరరావు మృతి పట్ల తీవ్రగ్రాంతి చెందిన మధిర శాసనసభ్యులు, శాసనసభ పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క హుటా హుటిన ఢిల్లీ నుంచి ఖమ్మం చేరుకొని ఐతం వెంకటేశ్వరరావు పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఐతం వెంకటేశ్వరరావు తన గురువుతో సమానమని మొదటి నుంచి తనకు తోడుగా ఉన్నారని జ్ఞాపకాలు గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఐతం వెంకటేశ్వరరావు అంతిమయాత్రలో పాల్గొని పాడెను మోసి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఈ అంతిమయాత్రలో ఏ కె. రామారావు, పొట్ల నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పుచ్చకాయల వీరభద్రం, మిక్కిలినేని నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

:(నేటినిజం ప్రతినిధి): స్వాతంత్ర సమరయోధులు కాంగ్రెస్ నాయకులు ఐతం వెంకటేశ్వరరావు మృతి పట్ల తీవ్రగ్రాంతి చెందిన మధిర శాసనసభ్యులు, శాసనసభ పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క హుటా హుటిన ఢిల్లీ నుంచి ఖమ్మం చేరుకొని ఐతం వెంకటేశ్వరరావు పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఐతం వెంకటేశ్వరరావు తన గురువుతో సమానమని మొదటి నుంచి తనకు తోడుగా ఉన్నారని జ్ఞాపకాలు గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఐతం వెంకటేశ్వరరావు అంతిమయాత్రలో పాల్గొని పాడెను మోసి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఈ అంతిమయాత్రలో ఏ కె. రామారావు, పొట్ల నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పుచ్చకాయల వీరభద్రం, మిక్కిలినేని నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ముంబై దాడులతో మన బలహీనతలు బయటపడ్డాయి

-పుస్తకం 'యాజ్ గుడ్ యాజ్ మై వర్డ్'లో యూపీఏ ప్రభుత్వంలో కేబినెట్ సెక్రటరీ చంద్రశేఖర్

న్యూఢిల్లీ డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో కేబినెట్ సెక్రటరీగా పని చేసిన కేఎం చంద్రశేఖర్ ఆనాటి పరిస్థితులను ఘాటుగా విమర్శించారు. 2008 నవంబరులో ముంబైపై జరిగిన ఉగ్రవాద దాడులపై స్పందిస్తూ, కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఎవరు ఏ పని చేయాలనేదానిపై అప్పటి ప్రభుత్వంలో స్పష్టత లేకపోయిందని చెప్పారు. ఈ దాడుల వల్ల మన ప్రభుత్వంలో నిర్ణయాలు తీసుకోవడంలో బలహీనతలు బయటపడ్డాయని చెప్పారు. ఆయన రాసిన పుస్తకం 'యాజ్ గుడ్ యాజ్ మై వర్డ్'లో ఈ వివరాలను వెల్లడించారు.జాతీయ భద్రతా సలహాదారు (ఔం) పదవిని 1998లో సృష్టించారని, ఇది సరైన దిశలో తీసుకున్న నిర్ణయమేనని చంద్రశేఖర్ ఈ పుస్తకంలో పేర్కొన్నారు. అయితే ఈ పదవిని సృష్టించిన తర్వాత ఏర్పడిన పరిస్థితిని ఆయన తప్పుబట్టారు. అధికారాలను ఎన్ఎస్ఏ, కేబినెట్ సెక్రటరీల మధ్య పంపిణీ చేయడం వల్ల గందరగోళం ఏర్పడిందన్నారు. భద్రతకు సంబంధించిన అంశాల నిర్వహణలో పోషించవలసిన పాత్రలపై గందరగోళం ఏర్పడటానికి అవకాశం కలిగిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మన దేశంలో అత్యున్నత స్థాయిలో నిర్ణయాలు తీసుకోవడంలో బలహీనతను 26/11 దాడులు బయటపెట్టాయని పేర్కొన్నారు.హోం మంత్రిత్వ శాఖ, రక్షణ దళాల నిఘా విభాగం క్రింద పని చేసే వేర్వేరు సంస్థలు క్షేత్ర స్థాయి విషయాలను సాధారణంగా కేబినెట్ సెక్రటరీకి తెలియజేయవని చెప్పారు. కేవలం కొన్ని జ్యూసీ బిట్స్‌ను మాత్రమే హోం మంత్రిత్వ శాఖకు లేదా రక్షణ మంత్రిత్వ శాఖకు లేదా ఎన్ఎస్ఏకు తెలియజేస్తాయన్నారు. అదే సమయంలో సకాలంలో తగిన సమాచారం లేకుండా కేబినెట్ సెక్రటరీ సంక్షోభ పరిస్థితులను పరిష్కరించవలసి ఉంటుందన్నారు. ఆ సంక్షోభం ఉగ్రవాద దాడి, లేదా హైజాక్, లేదా రకరకాల ఉగ్రవాదం కావచ్చునని తెలిపారు. సమన్వయపరిచే యంత్రాంగం ఏదీ లేదని తెలిపారు.

ముంబైపై 2008 నవంబరులో దాడులు జరిగినపుడు నిజమైన సంక్షోభం ఏర్పడిందని, ఆ సమయంలో కేంద్ర స్థాయిలో ఎవరు ఏ పని చేయాలో స్పష్టత లేదని చెప్పారు. భారత రాజ్యాంగం ప్రకారం శాంతిభద్రతలు అనేది రాష్ట్రాలకు సంబంధించిన విషయమని, సంబంధిత రాష్ట్రం కోరినపుడు మాత్రమే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడానికి వీలవుతుందని తెలిపారు. దీంతో గందరగోళం ఏర్పడిందన్నారు. ఎటువంటి సమాచారం లేకుండానే తాను ఆ సంక్షోభంలోకి దిగవలసి వచ్చిందన్నారు. నిఘా సమాచారం లేదని, ముంబైలో ఏం జరుగుతోందో రాత్రి వరకు తనకు తెలియలేదని చెప్పారు. ఆ సంక్షోభ తీవ్రత ఏమిటి? దానిని ఆ రాష్ట్ర ప్రభుత్వం స్

కనకరత్నంని పరామర్శించిన కోసూరి శ్రీనివాస్

ఖమ్మం, డిసెంబర్ 2 : (నేటినిజం ప్రతినిధి): వైరా మండలం సిరిపురం గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడి ఖమ్మం జాబితెట్టి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఐనాల కనకరత్నం ని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నా వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ ఛైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, ఈ కార్యక్రమంలో తనికెళ్ళ ఎంపీటీసీ గుండ్ల కోటేశ్వరరావు, సూడా డైరెక్టర్ బండారు కృష్ణ, నాయకులు కొనకంచి మోషే, అయోధ్య, శ్రీనివాసరావు, భాస్కర్, శ్రీను, తదితరులు ఉన్నారు.

ముగ్గురు ఐఐటీ విద్యార్థులకు బంపర్ ఆఫర్ : రూ .4 కోట్ల ప్యాకేజ్ ఆఫర్

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: గ్లోబల్ ప్రొప్రైటరీ ట్రేడింగ్ కంపెనీ జేన్ స్ట్రీట్ ముగ్గురు ఐఐటీ విద్యార్థులకు రూ . 4 కోట్ల పైబడిన వార్షిక వేతన ప్యాకేజ్‌ను ఆఫర్ చేస్తూ సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఐఐటీ ఢిల్లీ, బాంబే, కాన్పూర్ బ్రాంచ్‌లకు చెందిన ముగ్గురు విద్యార్థులకు ఈ భారీ బొనాంజా దక్కింది. ఆర్థిక మాంద్యం భయాలతో టెక్ కంపెనీలు హైరింగ్‌ను కుదించిన నేపథ్యంలో ఈ ఏడాది ప్లేస్‌మెంట్ సీజన్ ప్రారంభమైన మొదటి రోజునే జేన్ స్ట్రీట్ ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ఐఐటీ విద్యార్థులను వరించాయి.

జేన్ స్ట్రీట్ ఆఫర్స్ ఇప్పటివరకూ అత్యధిక ఆఫర్స్ అని ఐఐటీ కాన్పూర్, ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే ప్లేస్‌మెంట్ అధికారులు వెల్లడించారు. గత ఏడాది ఐఐటీ విద్యార్థుల ఫైనల్ ప్లేస్‌మెంట్‌లో ఊబర్ రూ 2.16 కోట్ల వేతన ప్యాకేజ్‌ను ఆఫర్ చేసింది. ఐఐటీ రూర్కీ విద్యార్థి ఇంటర్‌నేషనల్ పొజిషన్ కోసం గరిష్టంగా రూ 1.6 కోట్ల ఆఫర్‌ను పొందారు.

ఇక ఇదే బ్రాంచ్ విద్యార్థులు గురువారం ఆరు అంతర్జాతీయ పొజిషన్స్‌ను తమకు వచ్చిన ఆఫర్స్‌ను అంగీకరించారు. క్యాంపస్‌లో మొదటి రోజు తొలి సెషన్‌లో ఐఐటీ మద్రాస్ విద్యార్థులు 445 ఆఫర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇది గత ఏడాది ప్లేస్‌మెంట్ ఆఫర్స్ కంటే పది శాతం అధికం కావడం గమనార్హం. వీటిలో 25 ఆఫర్లు రూ. కోటి వేతనం పైబడిన ఆఫర్లను విద్యార్థులు ఆమోదించారు. ఆప్టివర్, డ విన్సి, కొహెసిటీ, రుబ్రిక్ వంటి కంపెనీలు మద్రాస్ క్యాంపస్‌లో 15 ఇంటర్నేషనల్ పొజిషన్స్‌ను విద్యార్థులకు ఆఫర్ చేశాయని అధికారులు తెలిపారు.

అసెంబ్లీ వ్యూహమేంటి, ఏ అంశాలు చర్చిద్దాం.. కేంద్రంతోపాటు, గవర్నర్ వ్యవహారంపైనా కేసీఆర్ సమాలోచనలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: : రాష్ట్రంలో అసంపూర్తిగా ఆగిపోయిన పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల పూర్తి దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నికల ఏడాది కావడంతో పాలనలో వేగం పెంచే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రజల ఆకాంక్షలు, అవసరాల దిశగా దృష్టి కేంద్రీకరించారు. ఈ దిశగా రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న సమస్యలు, ప్రజల డిమాండ్లను తెలుసుకుంటున్నారని సమాచారం. ఇందుకు ప్రజా ప్రతినిధులు మొదలుకొని అధికారులతో వివిధ రూపాల్లో సమాచార సేకరణ చేస్తున్న ఆయన డిసెంబర్‌లో వారం రోజులపాటు నిర్వహించాలని భావిస్తున్న అసెంబ్లీ సమావేశాల్లో పలు కీలక ప్రకటనలు చేయనున్నారని తెలుస్తోంది. ఇందుకు ఈ నెల మొదటి వారంలో అధికారులతో విస్తృత స్థాయి సమావేశం జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. డిసెంబర్ 13తో సీఎం కేసీఆర్ రెండో దఫా సీఎంగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తవనున్న నేపథ్యంలో కీలక సంస్కరణల దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

ధరణి, పోడు భూముల సమస్యలు, సొంత ఇంటి జాగ ఉన్నవారికి రూ.3 లక్షల ఆర్థిక సాయం, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, ధాన్యం కొనుగోళు, యాసంగి సాగు, రైతుబంధు, పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీ, కొత్త పింఛన్లు, ఇతర నూతన పథకాలపై అధికారులతో చర్చించనున్నట్లుగా సమాచారం. అదేవిధంగా రాష్ట్ర అప్పులపై కేంద్ర ఆంక్షలను ఎండగట్టేలా సమావేశాల నిర్వహణకు కీలక అజెండాను ప్రభుత్వం రూపొందించుకుంటోంది. ఆయా అంశాలపై శాఖల వారీగా వివరాలపై అధికారులతో చర్చించి సమగ్ర నివేదికను సిద్ధం చేయనున్నారని సమాచారం. 14, 15వ ఆర్థిక సంఘం సిఫార్సులను కేంద్రం పట్టించుకోకపోవడంతో జరిగిన ఆర్థిక నష్టంతోపాటు, గ్రాంట్లు, రాష్ట్ర హక్కుగా రావాల్సిన నిధుల చెల్లింపుల్లో జాప్యంపై కేంద్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టులో కేసు వేసి న్యాయపోరాటం దిశగా చర్చించనున్నట్లు తెలిసింది.

శాసనసభా ప్రత్యేక సమావేశంలో పలు తీర్మానాలు చేయాలని భావిస్తున్న సర్కార్ ఇందుకు వీలుగా అధికారుల నుంచి శాఖల వారీగా సమాచార సేకరణ చేయనున్నది. సెస్‌ల పేరుతో పన్నుల వాటాను 41శాతం నుంచి 29శాతానికి కుదించిందని రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహంగా ఉన్నది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు రూ.1350 కోట్లు, 14వ ఆర్థిక సంఘం సూచించిన స్థానిక సంస్థలకు రూ.315 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.502 కోట్లు పన్నుల పరిహారం రూ.723 కోట్లు పెండింగ్‌లో పెట్టడం పట్ల తీర్మానం చేయనున్నారు. కేంద్రానికి తీర్మానం పంపిన తర్వాత న్యాయపోరాటం దిశగా యోచిస్తోంది. ఇక ప్రభుత్వ బిల్లులను ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టిన గవర్నర్ తీరుపై కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహంగా ఉంది.

ఎనిమిది బిల్లులను గత సమావేశాల్లో ఆమోదించి పంపినా వాటిలో ఏడు బిల్లులను ఇంకా గవర్నర్ ఆమోదించకుండానే పెండింగ్‌లో పెట్టారు. ఈ నేపథ్యంలో ఆర్టికల్ 200లో ఉన్న యాజ్ సూన్ యాజ్ పాసిబుల్ అనే పదాన్ని తొలగించి 30 రోజుల గడువును విధిస్తూ రాజ్యాంగాన్ని సవరించాలని కోరుతూ ప్రభుత్వం మరో తీర్మానం చేసే అవకాశం ఉంది. ఈ మేరకు ఆయా అన్ని అంశాలపై చర్చించేందుకు, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు, డిమాండ్లను ఆకళింపు చేసుకునే దిశలో డిసెంబర్ మొదటి వారంలో సీఎం కేసీఆర్ కీలక సమావేశానికి సిద్ధమవుతున్నారు.

ప్రియుడితో పారిపోయేందుకు.. తనలాగా ఉన్న మహిళను హత్య చేసిన యువతి

లక్నో, డిసెంబర్ 2: ప్రియుడితో పారిపోయేందుకు తనలాగా పోలికలు ఉన్న మహిళను ఒక యువతి హత్య చేసింది. మృతదేహానికి తన దుస్తులు వేసి తనే ఆత్మహత్య చేసుకున్నట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించింది. ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఈ సంఘటన జరిగింది.

22 ఏళ్ల పాయల్ భాటి తండ్రి అప్పుల వేధింపుల వల్ల ఆరు నెలల కిందట ఆత్మహత్య చేసుకున్నాడు.

అయితే తండ్రి మరణానికి సోదరుడు, అతడి భార్య తరుపు కుటుంబం కారణమని ఆమె ఆరోపించింది. వారిని కేసులో ఇరికించంతోపాటు తన ప్రియుడైన అజయ్ ఠాకూర్‌తో పారిపోయేందుకు ఒక ప్లాన్ వేసింది. గౌర్ సిటీ మాల్‌లో పని చేసే ఒక మహిళకు తనలాంటి పోలికలు ఉండటంతో ఆమెతో స్నేహం చేసింది.

కాగా, నవంబర్ 12న పాయల్ భాటి ఆ మహిళను తన ఇంటికి తీసుకువచ్చింది. ప్రియుడు అజయ్‌తో కలిసి ఆమెను హత్య చేసింది. ఆమె మృతదేహానికి తన దుస్తులు తొడిగింది

. గుర్తుపట్టకుండా ఉండేందుకు ఆ మహిళ ముఖాన్ని కాల్చివేసింది. 'నా ముఖం కాలిపోయింది, నాకు జీవించడం ఇష్టం లేదు' అని సూసైడ్ లేఖను పాయల్ రాసింది. అనంతరం ప్రియుడు అజయ్‌తో కలిసి పారిపోయింది. అయితే పాయల్ ఆత్మహత్య చేసుకుని చనిపోయినట్లు భావించిన బంధువులు ఆ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

మొఘలుల పాలనలో ఒక్క హిందువు కూడా మిగిలేవాడు కాదు

- తీవ్ర దుమారం రేపుతున్న కర్ణాటక విశ్రాంతి న్యాయమూర్తి వ్యాఖ్యలు

బెంగళూరు డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: నిజంగానే హిందువులంటే ముస్లింలకు ద్వేషమే ఉంటే మొఘలుల పాలనలో ఒక్క హిందువు కూడా మిగిలేవాడు కాదంటూ కర్ణాటక విశ్రాంతి న్యాయమూర్తి వసంత ములసావలగి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. 'రాజ్యాంగ లక్ష్యాలు నెరవేరాయా?' అన్న అంశంపై విజయపురలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ.."మొఘలుల పాలనలో ముస్లింలు కనుక హిందువులను వ్యతిరేకించి ఉంటే దేశంలో ఒక్క హిందువు కూడా మిగిలి ఉండేవాడు కాదు. హిందువులందరినీ వారు చంపేసి ఉండేవారు. వారు వందల సంవత్సరాలు పాలించినా వారెందుకు మైనారిటీలుగా మిగిలిపోయారు?" అని ములసావలగి ప్రశ్నించారు.రిటైర్డ్ జడ్జ్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. రాష్ట్రీయ సౌహార్ద వేదిక, ఇతర సంస్థలు కలిసి గురువారం ఈ సెమినార్‌ను నిర్వహించాయి. ముస్లింలు అది చేశారు, ఇది చేశారని అని ఆరోపించేవారు తొలుత దేశంలో 700 సంవత్సరాల ముస్లింల పాలన ఏం చెబుతుందో తెలుసుకోవాలని విశ్రాంత న్యాయమూర్తి పేర్కొన్నారు. అక్బర్ భార్య హిందువని, ఆమె ఇస్లాంలోకి మారలేదని గుర్తు చేశారు. అక్బర్ తన రాజ్యంలో శ్రీకృష్ణుడి ఆలయం నిర్మించాడని అన్నారు. ఆ ఆలయాన్ని ప్రజలు ఇప్పటికీ చూడొచ్చని పేర్కొన్నారు.హిందూ దేవుళ్లయిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు నవలల్లోని పాత్రలు మాత్రమేనన్న ఆయన.. వారు చారిత్రక పురుషులు కాదన్నారు. అశోక చక్రవర్తి మాత్రం నిజమైన చారిత్రక పురుషుడని నొక్కి చెప్పారు. ''ఉత్తరాఖండ్‌లో శివలింగంపై బుద్ధుడి చిత్రాలు ఉంటాయి. ఈ మేరకు బౌద్ధులు పిటిషన్ కూడా దాఖలు చేశారు. దేవాలయాలను మసీదులుగా మార్చారని అంటున్నారు. దేవాలయాలను నిర్మించకముందే అశోక చక్రవర్తి 84 వేల బుద్ధ విహారాలను నిర్మించాడు. మరివారెక్కడికి వెళ్లారు? కాలక్రమంలో ఇది జరిగింది. దీనిని పెద్ద సమస్యగా మార్చగలరా? అని వసంత ములసావలగి ప్రశ్నించారు.రాజ్యంగ లక్ష్యాలు స్పష్టంగా, కచ్చితంగా ఉన్నాయన్న ములసావలగి.. రాజ్యాంగ లక్ష్యాలను నెరవేర్చడంలో వ్యవస్థ విఫలమవుతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. దీనికి ముగింపు పలికేందుకు యువతరం ఈ దిశగా అప్రమత్తంగా, చురుగ్గా మారాలని ఆయన సూచించారు. యథాతథ స్థితిని కొనసాగించేందుకు, దేవాలయాలు, చర్చిలు, మసీదులను యథాతథంగా ఉంచేందుకు 1999లో ఓ చట్టం ఉందని, కానీ ఈ విషయంలో జిల్లా కోర్టు పరస్పర విరుద్ధమైన తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు.మరో విశ్రాంత న్యాయమూర్తి అరాళి నాగరాజ్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు విజయం సాధించిన తర్వాత పార్టీ మారకూడదన్న అఫిడవిట్ ఉండాలని అన్నారు. ఇలాంటి చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్యానికి ముందు దేశభక్తి పతాకస్థాయిలో ఉండేదని, కానీ ఇప్పుడు స్వార్థం దానిని అధిగమించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అమెరికా పౌరసత్వం పొందడానికి బంగారుబాట ఈబీ-5 వీసా

న్యూఢిల్లీ డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: అమెరికా పౌరసత్వం పొందడానికి బంగారుబాట ఈబీ-5 వీసా దీనిని గోల్డెన్ వీసా ప్రోగ్రామ్ అని కూడా పిలుస్తారు. సంపన్న దరఖాస్తుదారులను ఇది గొప్పగా ఆకర్షిస్తోంది. అయితే ఈ వీసా కోసం పోటీ తీవ్రంగా ఉండటంతో ఆర్థిక అక్రమాలు కూడా జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ఈ వీసా దరఖాస్తుల క్లియరెన్స్ నత్తనడకన సాగుతుందనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎలోసీఆర్ కేపిటల్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సురేశ్ రాజన్ ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అత్యంత విలువైన సమాచారాన్ని వెల్లడించారు.

ఈబీ-5 (ఇ-5) వీసా అనేది ఎంప్లాయ్‌మెంట్ బేస్డ్ వీసాలలో ప్రత్యేకమైనదని చెప్పారు. దీనికి, హెచ్1బీ వీసాకు చాలా తేడా ఉందన్నారు. అమెరికాలో ఇమిగ్రెంట్ ఇన్వెస్ట్‌మెంట్ ఆధారంగా ఈబీ-5 వీసాను జారీ చేస్తారన్నారు. ఇది అమెరికా ఫెడరల్ ప్రోగ్రామ్ అని తెలిపారు. అమెరికాలో వ్యాపార రంగంలో పెట్టుబడులు పెట్టేవిధంగా ఇతర దేశాలవారిని ప్రోత్సహించడం కోసం దీనిని 1990వ దశకంలో రూపొందించారని చెప్పారు. విదేశీ పెట్టుబడుల ద్వారా అమెరికాలో ఉద్యోగాలను సృష్టించడం దీని లక్ష్యమని చెప్పారు. పెట్టుబడులు పెట్టినవారు, అందుకు ప్రతిఫలంగా తమ కుటుంబ సభ్యులకు కూడా గ్రీన్ కార్డులను పొందవచ్చునన్నారు. అవివాహితులైన 21 సంవత్సరాల లోపు వయసుగల పిల్లలకు కూడా ఈ విధంగా గ్రీన్ కార్డ్ పొందవచ్చునని చెప్పారు. గతంలో కనీసం 5 లక్షల డాలర్లు పెట్టుబడి పెట్టవలసి ఉంటుందనే నిబంధన ఉండేదని, ఇప్పుడు దీనిని 8 లక్షల డాలర్లకు పెంచినట్లు చెప్పారు. ఈ పెట్టుబడితో అమెరికాలో కొన్నేళ్ళపాటు కనీసం 10 ఉద్యోగాలను సృష్టించవలసి ఉంటుందన్నారు. అమెరికాలోని ఇమిగ్రెంట్స్‌కు ఈ వీసా పథకం బాగా ఉపయోగపడుతుందన్నారు.

ఇతర వీసాలతో పోల్చుకుంటే, ఈబీ-5 ప్రోగ్రామ్ చాలా విస్తృత అవకాశాలను ఇస్తుందన్నారు. గ్రీన్ కార్డు సంపాదించడానికి, ఆ తర్వాత అమెరికా పౌరసత్వం పొందడానికి వేగంగా, నేరుగా బాటలు పరుస్తుందని చెప్పారు.

ఈబీ-5 వీసా ప్రోగ్రామ్ 1990వ దశకంలో ప్రారంభమైనప్పటికీ, 2008లో ఆర్థిక సంక్షోభం తలెత్తే వరకు దీని పట్ల పెద్దగా ఎవరూ ఆకర్షితులు కాలేదన్నారు. డెవలపర్స్ ఆర్థిక వనరులను పొందడానికి ఈ ప్రోగ్రామ్ అవకాశం కల్పించిందన్నారు. విదేశాలలోని సంపన్న ఈబీ-5 పార్టిసిపెంట్స్ నుంచి డెవలపర్స్ నిధులను పొందగలిగారని తెలిపారు. సంక్షోభ సమయాల్లో ఇది మంచి ప్రయోజనాలను ఇచ్చిందన్నారు. గతంలో రుణదాత, రుణ గ్రహీత ఒకే సంస్థ నియంత్రణలో ఉండేవారన్నారు. మదుపరుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేవారు మదుపరుల తరపున ఎవరూ ఉండేవారు కాదని తెలిపారు.

ఈబీ-5 వీసా ప్రోగ్రామ్‌పై వస్తున్న విమర్శల గురించి సురేశ్ మాట్లాడుతూ, ఈబీ-5 అనేది కేపిటల్ మార్కెట్ అని, సరైన నియంత్రణ లేకపోతే, ప్రతి కేపిటల్ మార్కెట్లోనూ కొంత వరకు మోసాలు జరిగే అవకాశాలు ఉంటాయని చెప్పారు. అయితే ఈబీ-5 రిఫార్మ్ అండ్ ఇంటెగ్రిటీ యాక్ట్ ద్వారా 2022లో దీనిని రెన్యూ చేశారని తెలిపారు. ప్రస్తుతం పెట్టుబడిదారులకు చాలా అనుకూలంగా మారిందన్నారు. ఈ ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్ అందరిలో ఇప్పుడు గొప్ప పారదర్శకత ఉందన్నారు.

నూతనంగా శ్రీ సాయి రెసిడెన్సి హోటల్ ప్రారంభం

ఖమ్మం, డిసెంబర్ 2 : (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలోని 57వ డివిజన్ నందు ప్రోప్రైటర్ ఏనుగంటి సురేష్ - గుంటూరు శ్రీనివాస్ నూతనంగా ఏర్పాటుచేసిన హోటల్ శ్రీ సాయి రెసిడెన్సి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

అనంతరం హోటల్ సిబ్బంది అతిథులందరికీ శాలువా కప్పి పుష్పగుచ్చలు అందజేసి స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దోరేపల్లి శ్వేత, పైడిపల్లి రోహిణి, చిరుమామిళ్ల ప్రశాంత లక్ష్మి, నిరీష, గజ్జల లక్ష్మి, టిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, మంత్రి పిఏ చిరుమామిళ్ల రవి కిరణ్, దోరేపల్లి రవి, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మరియు హ్పటల్ శ్రీ సాయి రెసిడెన్సి వారి బంధుమిత్రులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శని, ఆదివారాలలో జిల్లాలోని 576 పోలింగ్ కేంద్రాలలో ఓటరు నమోదు కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలు

మెదక్, డిసెంబర్ 2: నేటినిజం ప్రతినిధి):శని,ఆదివారాలలో జిల్లాలోని 576 పోలింగ్ కేంద్రాలలో ఓటరు నమోదు కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ ఎస్.హరీష్ యువతకు సూచించారు. ఓటు ఎంతో విలువైనది, శక్తివంతమైనదని, ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటు ఆయుధమని అన్నారు. కాబట్టి 1 జనవరి 2023 నాటికి 18 ఏళ్ళు నిండే ప్రతి యువత ఓటరుగా నమోదు చేసుకోవలసిందిగా శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఓటరుగా నమోదు తో పాటు ఓటు హక్కును వినియోగిచుకోవడం నైతిక బాధ్యత అన్న విషయాన్ని విస్మరించరాదని ఆయన యువతకు సూచించారు. ఓటరు నమోదుకు సంబంధించి ప్రతి బూతు స్థాయి అధికారి వద్ద ఓటరు నమోదు ఫారం-6, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానానికి ఫారం-6బి, ఓటరు జాబితాలో పేరు ప్రతిపాదిత పేరును మార్చడం, తొలగించడానికి, అభ్యంతరాలకు ఫారం-7, నివాస మార్పు, నమోదుల సవరణ కోసం ఫారం-8 అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. ఎలక్టోరల్ లిటరసి క్లబ్ లు, క్యాంపస్ అంబాసిడర్లు, సూపెర్వైజరి అధికారుల ద్వారా ఓటరు నమోదు పై పాఠశాల,కళాశాలల స్థాయిలో విస్తృత అవగాహన కల్పించడం తో పాటు ఇటీవల నిర్వహించిన ప్రత్యేక శిబిరాలతో కలుపుకొని గత నెల 9 నుండి 30 వరకు 1,507 మంది కొత్తగా ఓటర్లుగా దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. 1 జనవరి 2022 న ఓటర్ల తుది జాబితా ప్రకటించినప్పుడు జిల్లాలో 6,14,464 మంది ఓటరు ఉండగా నవంబర్ 9 న డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటికి 6,18,532 మంది ఓటర్లు ఉన్నారని,అనగా 4,068 మంది కొత్తగా ఓటర్లుగా నమోదయ్యారని కలెక్టర్ వివరించారు. కాగా వచ్చే జనవరి నాటికి జిల్లాలో 18-19 సంవత్సరాలలో లోపు యువత 12 వేలకు పైగా ఉంటారని అంచనా అని, వారినందరిని గుర్తించి ఓటరుగా నమోదు చేయడం మన భాద్యతని అన్నారు. శని,ఆదివారాల్లో నిర్వహిస్తున్న శిబిరాన్ని కూడా సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని యువతకు సూచించారు. 17 సంవత్సరాలు పైబడిన వారు కూడా ముందస్తుగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఫారం-6 నింపి బూతు స్థాయి అధికారికి లేదా, ఎఇఆర్ ఓలేదా ఇ ఆర్ ఓ లకు అందించడం ద్వారా లేదా చరవాణిలో ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా గాని http://nvsp.in లేదా http://voterplortal.eci.gov.in పోర్టల్ ద్వారా గాని ఓటరుగా సులువుగా నమోదు చేసుకోవచ్చని ఆయన యువతకు సూచించారు. ఈ నెల 8 వరకు కొత్తగా ఓటర్ల నమోదు, మార్పులు,చేర్పులు, సవరణలకు అవకాశముందని అన్నారు. అంతేగాక ఇప్పుడు ఎన్నికల కమీషన్ ఏడాదిలో నాలుగు పర్యాయాలు అనగా జనవరి 1, ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్ళు నిండే వారందరు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించిందని తెలిపారు. ఓటరు నమోదు కోసం పోలింగ్ కేంద్రాలలో శని ,ఆదివారాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం గురించి ముందస్తుగా గ్రామాలలో టాం టాం వేయాలని, అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రత్యేక శిబిరం అనంతరం బూతు స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి అర్హులను, ట్రాన్స్ జెండర్లు , వికలాంగులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 80 శాతం ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేశామని, వంద శాతం పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు.

దోచుకోవడం, దాచుకోవడమే జగన్ రెడ్డి పని: జనసేన

గుంటూరు డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: దోచుకోవడం, దాచుకోవడమే జగన్ రెడ్డి పని అని జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు విమర్శలు గుప్పించారు.

జిల్లాలోని కొల్లిపర మండలం బొమ్మువానిపాలెంలో ఇసుక రీచ్‌లను జనసేన నేతలు సందర్శించారు. జేపీ కంపెనీ చేసే ఇసుక అక్రమ తవ్వకాలు ఆపాని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గాదె మాట్లాడుతూ.. ఇసుక అక్రమ తవ్వకాలతో పర్యవరణాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు తిరిగే రోడ్లు వేయడం లేదని... ఇసుక రవాణా కోసం మాత్రం నదిగర్భంలో రోడ్లు వేస్తున్నారని విమర్శించారు. అడ్డగోలు తవ్వకాలతో చుట్టుపక్కల పంటలు కూడా నాశనం అవుతున్నాయన్నారు. తక్షణమే అక్రమ రవాణా ఆపకపోతే జనసేన రోడ్డు ఎక్కి ఆందోళన చేస్తుందని గాదె వెంకటేశ్వరరావు హెచ్చరించారు.

జగిత్యాల జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

జగిత్యాల, డిసెంబర్ 2: పలు జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను జగిత్యాల జిల్లా పోలీసులు పట్టుకున్నారు. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలతో పాటు ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మేడిపల్లి , రాయికల్ మండలాలలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరితో పాటు దొంగిలించిన సొమ్మును కొనుగోలు చేస్తున్న మరో వ్యక్తిని అరెస్టు చేశారు.

సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌కు చెందిన జాదవ్ జయరాం, జాదవ్ పుండలిక్‌లు సంవత్సరం కాలంగా వరున దొంగతనాలకు పాల్పడుతున్నారని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి మీడియాకు తెలిపారు. ఈ దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామని వెల్లడించారు. తమ గాలింపులో జాదవ్ జయరాం, జాదవ్ పుండలిక్ అనుమానంగా సంచరిస్తుండడంతో పట్టుకుని విచారించగా జగిత్యాల జిల్లాలో 15 చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారని తెలిపారు.

వీరు ఆయా ప్రాంతాల నుంచి 845 గ్రాముల బంగారం, 1580గ్రాముల వెండి, రూ.2. 69 లక్షల నగదును దోచుకెళ్లారని, దొంగిలించిన వస్తువులను నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన అవుసల వర్జన్ అనే వ్యక్తి కొనుగోలు చేయగా అతన్నికూడా అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు

జేపీ నడ్డాకు చంద్రబాబు పుట్టిన రోజు శుభాకాంక్షలు

అమరావతి డిసెంబర్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కు ట్విట్టర్ ద్వారా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. 'జేపీ నడ్డాజీకి జన్మదిన శుభాకాంక్షలు ఆయనకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయువు ప్రసాదించాలని కోరుకుంటున్నా' అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.

మరింత ప్రియం కానున్న మారుతి సుజుకి కార్లు.. 2023 జనవరిలో ధరలు పెంచనున్న కంపెనీ

హైదరాబాద్, డిసెంబర్ 2: మారుతి సుజుకి కార్లు మరింత ప్రియం కానున్నాయి.

అందుకు కారణం ఏంటంటే.. వచ్చే ఏడాది ప్రారంభం నుంచి కార్ల ధరను పెంచనుంది. 2023 జనవరి నుంచి తమ కంపెనీ కార్ల ధర పెంచుతున్నామని మారుతీ సుజుకీ శుక్రవారం వెల్లడించింది. అయితే.. కార్ల మోడల్స్‌ను బట్టి ధరలో తేడా ఉంటుందని తెలిపింది. తయారీ ఖర్చు పెరగడంతో పాటు ద్రవ్యోల్బణం కారణంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

అంతేకాదు తయారీ ఖర్చును తగ్గించుకునే పనిలో ఉన్నట్టు సంస్థ చెప్పింది.

ఈ ఏడాది నవంబర్ నాటికి 1,59,044 మారుతి సుజుకి వాహనాల అమ్మకాలు జరిగాయి. వీటిలో భారతదేశవ్యాప్తంగా 1,35,055 వాహనాలు అమ్ముడుపోయాయి.

19,738 వాహనాలను ఎగుమతి చేసింది. చిన్న కార్ల విభాగంలో ఆల్టో, ఎస్ ప్రెస్సో కార్లు అత్యధికంగా (18,251) సేల్ అయ్యాయి. స్విఫ్ట్, వితార బ్రెజా, ఎర్టిగా కార్లు అన్నీ కలిపి 32,563 అమ్మకాలు జరిగాయి. మారుతి సుజుకి కంపెనీ వాహనాల ధరలు పెంచడం ఇదే మొదటిసారి కాదు. 2021 జనవరి నుంచి 2022 మార్చి నాటికి కార్ల ధరను దాదాపు 8.8శాతం పెంచింది. ప్రస్తుతం రవీంద్ర చంద్ర భార్గవ మారుతి సుజుకి సీఈఓగా ఉన్నారు.

శ్రీ బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్

శ్రీ బండికల్లు వెంకటేశ్వర

దళితుల ఆర్థిక పురోగతిని చేకూర్చే పథకం దళిత బంధు -ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు

-వేములవాడ అర్బన్ మండలంలో రు.70 లక్షల విలువ గల 7 యూనిట్ల ప్రారంభం!

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 2 : (నేటినిజం ప్రతినిధి): దళిత ల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ చేపట్టిన దళిత బంధు పథకం ఒక గొప్ప పథకం మని దళితులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపితం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేష్ బాబు అన్నారు. శుక్రవారంవేములవాడ అర్బన్ మండలంలో అనుపురం గ్రామంలో డైరీ యూనిట్ స్థాపన కొరకు భూమి పూజ మరియు హరినీ డీజే సౌండ్స్, కొడుముంజ గ్రామంలో డీజే సౌండ్స్ మరియు శ్రీ రాజ రాజేశ్వర సూపర్ మార్కెట్, శాభాష్ పల్లి గ్రామంలో , చీర్లవంచ గ్రామంలో కామాక్యా మాతా సెంట్రింగ్ వర్క్స్, చంద్రగిరి గ్రామంలో శ్రీ లక్ష్మి సెంట్రిక్ వర్క్స్ దళితబంధు యూనిట్ లను శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ సీ.ఎం.కేసీఆర్ అన్ని వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని దళితుల యొక్క పట్టుదల, నైపుణ్యం, వారి ఆత్మ స్తైర్యాన్ని చూసి దళిత బంధు ప్రవేశ పెట్టారన్నారు. మొదటి విడతలో నియోజకవర్గంలో ప్రారంభించబడిన వంద యూనిట్లలో సెంట్రింగ్, డీ.జే సిస్టమ్స్, టెంట్ హౌజ్, డైరీ, పల్లెవెలుగు బస్, స్పైనీ ప్రాసెసింగ్, కుట్టు మిషన్ మొదలగు యూనిట్లు ప్రారంభించామన్నారు. రానున్న రోజుల్లో మరో 1500 యూనిట్లుకు గాను మొదటి విడతలో మరో 500 పారదర్శకంగా ఎంపిక చేస్తామన్నారు.

తెలంగాణ రాష్ట్రం వచ్చాక చేసిన అభివృద్ధి కార్యక్రమాల్లో దళిత బంధు ప్రత్యేకం అని, దళితుల కుటుంబాల్లో ఆర్థిక స్వాలంభనకు ఈ పథకం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ గారు, జెడ్.పి చైర్మన్ న్యాలకొండ అరుణ , ఎం.పి.పి బూర వజ్రమ్మ , జెడ్.పి.టి.సి మ్యాకల రవి , అర్బన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఊ రిడి ప్రవీణ్, సర్పంచ్లు, ఎం.పి.ట .సీలు, ఏ.ఎం.సి డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని కడిగేసేందుకు ఒక్క ఛాన్స్ ఇవ్వండి: కేజ్రివాల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో పేరుకుపోయిన అవినీతిని కడిగేసేందుకు తమకు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రివాల్ అక్కడి ఓటర్లను కోరారు. వచ్చే ఆదివారం (డిసెంబర్ 4) ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో కేజ్రివాల్ ఇవాళ నగరంలో వ్యాపారులతో సమావేశమయ్యారు.

ఢిల్లీలో అధికారం తమది ఉంటే, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ చేతిలో ఉన్నదని, దాంతో ఢిల్లీలో వాయు, నీటి కాలుష్య నివారణకు ఏమీ చేయలేకపోతున్నామని కేజ్రివాల్ చెప్పారు. గతంలో కూడా ఎప్పుడూ ఢిల్లీ పీఠం, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ పీఠం ఒకే పార్టీ చేతిలో లేవని, ఈ సారి ఆ సంప్రదాయాన్ని తిరగరాయాలని, మున్సిపల్ కార్పొరేషన్‌లో తమను గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు.

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొన్నది. ఆప్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యే ప్రధానంగా పోటీ ఉండనుంది. ఈ నెల 4న ఎంసీడీ (మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ) ఎన్నికల పోలింగ్ జరగనుండగా, ఈ నెల 7న ఓట్లను లెక్కించనున్నారు.

పేదింటి ఆడబిడ్డ పెళ్ళికి అండగా నిలిచిన కళ్యాణలక్ష్మి

సత్తుపల్లి, డిసెంబర్ 2 (నేటినిజం ప్రతినిధి) :వేంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన బండి సుకన్య గత కొన్ని సంవత్సరాల క్రితం తల్లి మృతి చెందింది. తండ్రి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తల్లిదండ్రులను కోల్పోయిన బండి సుకన్య కు మంజూరు అయిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెళ్లి కానుక కళ్యాణలక్ష్మి చెక్కును సత్తుపల్లి శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య, నేరుగా వారి ఇంటికి వెళ్లి బండి సుకన్యకు అందజేసి, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, సొంత ఖర్చులతో పెళ్ళికానుకగా చీరను బహుకరణ చేశారు. తల్లి దండ్రులను కోల్పోయిన పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి అండగా నిలిచిందని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి చెక్కులను పంపిణీ చేస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డల పెళ్ళికాన టుక సత్ఫలితాలను ఇచ్చిందని, నిరుపేదలకు అండగా నిలిచిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ఇంతటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ కి కృతజ్ఞతలు తెలిపినట్లు ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తెలిపారు.

విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు తొలిమెట్టు కార్యక్రమం

ఖమ్మం, డిసెంబర్ 2 : (నేటినిజం ప్రతినిధి): విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ప్రజ్ఞ సమావేశ మందిరంలో విద్యాధికారులు, తొలి మెట్టు నోడల్ అధికారులతో తొలి మెట్టు కార్యక్రమంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాథమిక విద్య, పాఠశాల విద్యకు పునాది లాంటిదని అన్నారు. విద్యార్థులకు కనీస అభ్యాసన సామర్థ్యాలతో పాటు తరగతికి సంబంధించిన అభ్యాసన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు 44,486 మంది విద్యార్థులు ఉన్నట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో 84 మంది మండల రిసోర్స్ పర్సన్ కు, మండల స్థాయిలో 2,293 మంది ఉపాధ్యాయులకు తొలి మెట్టు కార్యక్రమ అమలుపై శిక్షణ ఇచ్చినట్లు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు కార్యక్రమ అమలు పర్యవేక్షణకు అవగాహన కల్పించినట్లు ఆయన అన్నారు. ప్రాథమిక స్థాయి పిల్లలు, అక్షరాలను గుర్తించడం, పదాలు చదవడం, బేసిక్ మ్యాథ్స్ పై పట్టు సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ప్రతి ఒక పిల్లవాడు చక్కగా చదువుకోవాలి. రాయాలి అదేవిధంగా బేసిక్ మ్యాథ్స్ తెలిసేలా ఈ కార్యక్రమ కార్యాచరణ చేయాలన్నారు.

చదువులో వెనుకబడి ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రాథమిక అభ్యసన వైపు తీసుకువెళాలని కలెక్టర్ సూచించారు. స్వల్పకాలిక లక్ష్యాలను ఏర్పరచుకొని వందశాతం సాధనకు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాల ప్రణాళికను ఏర్పరచుకొని, ప్రదర్శన పాఠాలను చేపట్టాలని, సంబంధిత సబ్జెక్టు లో నైపుణ్యం పొందాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, సిఎంఓ రాజశేఖర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ఏఎంఓ రవికుమార్, మండల విద్యాధికారులు, తొలిమెట్టు నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

అమరావతి: డిసెంబర్ 2: ఏపీలోని నెల్లూరు జిల్లాలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని దొరవారిసత్రం మండలం నెలబల్లి జాతీయ రహదారి వద్ద లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న దంపతులు మునస్వామి, సునీత అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు.

టెక్నాలజీపై పట్టు బంగారు భవితకు మెట్టు

వరంగల్, డిసెంబర్ 2: శాస్త్ర, సాంకేతిక రంగాలపై పట్టు సాధిస్తే బంగారు భవిష్యత్ సాధ్యమని కలెక్టర్ గోపి అన్నారు. గురువారం 27వ డివిజన్ యాకూబ్‌పురలోని తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశానికి గుర్తింపు తీసుకువచ్చిన శాస్త్రవేత్తలు అందరూ విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ విజ్ఞానంపై మక్కువ పెంచుకున్నవాళ్లేనని పేర్కొన్నారు. ప్రస్తుతంల శాస్త్ర, సాంకేతిక రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని, మానవ జీవితంలో యంత్రాల వినియోగం పెరిగిపోయిందన్నారు.

టెక్నాలజీలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల పరిధిలోని 11 గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 18 విభాగాల్లో రూపొందించిన ఎగ్జిబిట్లను పరిశీలించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల కో ఆర్డినేటర్ డీఎస్ వెంకన్న, హెచ్ఎం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులను ఢీ కొట్టిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్.. రెండు నెలల్లోనే నాలుగో ప్రమాదం..!

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: ఇండియన్ రైల్వేస్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సెమీ హైస్పీడ్ రైలు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ తరచూ ప్రమాదాలకు గురవుతోంది. ఈ ట్రైన్ ప్రారంభమైన రెండు నెలల్లోనే మూడు సార్లు ట్రాక్‌పైకి వచ్చిన పశువులను ఢీ కొట్టింది. తాజాగా మరోసారి ఇదే తరహా ఘటన చోటు చేసుకుంది.

గురువారం సాయంత్రం గుజరాత్‌లోని ఉద్వాడ-వాపి స్టేషన్ల మధ్య పశువులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో రైలు ముందు భాగానికి చిన్నపాటి డెంట్ ఏర్పడింది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ప్రారంభం అయిన తర్వాత ప్రమాదం జరగడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం.

తాజా ఘటనపై పశ్చిమ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సుమిత్ ఠాకూర్ మాట్లాడుతూ.. 'గాంధీనగర్-ముంబై వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైంది. ఉద్వాడ ? వాపి మధ్య లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 87 సమీపంలో సాయంత్రం 6.23 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. ట్రైన్ ముందు భాగంలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తలేదు. చిన్నపాటి డెంట్ ఏర్పడింది. కొద్దిసేపు ఆగిన రైలు.. 6.35 గంటలకు తిరిగి ప్రారంభమైంది' అని తెలిపారు.

గ్రాండ్‌గా పెంపుడు కుక్క బర్త్ డే.. 350మంది అతిథులు.. గిఫ్ట్‌గా గోల్డ్ లాకెట్స్

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: తమ పెంపుడు కుక్క అక్సర్ బర్త్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు దాని యజమానులు. ఈ సంఘటన జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో చోటు చేసుకుంది. కుక్క యజమానులు దాదాపు 350 మందికి గ్రాండ్ బర్త్‌డే పార్టీని ఇవ్వడం అందరినీ ఆశ్చర్యానికి లోనుచేసింది.

ఇన్విటేషన్ కార్డులను ముద్రించడం నుంచి రూ . 4500 వెచ్చించి డ్రస్ కొనుగోలు చేయడం వరకూ పెంపుడు కుక్క బర్త్‌డే పార్టీకి ఆ కుటుంబం చేసిన హంగామా అంతా ఇంతా కాదు. పెంపుడు కుక్క బర్త్‌డే కోసం పరిసర గ్రామాల నుంచే కాకుండా బెంగాల్‌లోని శ్రీపూర్ వంటి ప్రాంతాల నుంచి అతిథులు శునకం బర్త్‌డే పార్టీ కోసం ధన్‌బాద్‌కు క్యూ కట్టారు.

బర్త్‌డే జరుపుకుంటున్న కుక్క కోసం బంధువులు బహుమతులను కూడా తీసుకువచ్చారు. మూడు గోల్డ్ లాకెట్స్‌ను పెంపుడు కుక్కకు కొందరు బహుకరించారు. అక్సర్ కేక్ కటింగ్‌కు ముందు హారతి ఇచ్చారు. పెంపుడు కుక్క బర్త్‌డే వేడుకలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో ప్రస్తుతం తెగ వైరలవుతోంది. ఈ వీడియోలో కుక్క చెంపపై మహిళ ముద్దు పెడుతుండటం కనిపించింది. టేబుల్ పైన భారీ కేక్ కూడా ఈ వీడియోలో చూడవచ్చు. అక్సర్ తమ కుటుంబ సభ్యుల్లో ఒకరని, తమతోనే ఉంటూ..తాము తినేదే తింటుందని యజమానులు సుమిత్ర కుమారి, నందీవ్ చెప్పారు. పెంపుడు జంతువులతో అనుబంధం అనేది ప్రత్యేకమైనదని, రోడ్డు పక్కన 20 రోజుల వయసున్న కుక్కపిల్లను ఇంటికి తీసుకువచ్చి పెంచుకున్నామని వెల్లడించారు.

శ్రీ ప్రముఖ్ స్వామి మహారాజ్ జీ జయంతి సందర్భంలో ఆయనకు శ్రద్ధాంజలి ఘటించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: పరమ పూజ్యులు ప్రముఖ్ స్వామి మహారాజ్ జీ యొక్క జయంతి సందర్భం లో ఆయన కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ శ్రద్ధాంజలి ఘటించారు. బిఎపిఎస్ శ్రీ స్వామినారాయణ్ సంస్థ చేసిన ఒక ట్వీట్ కు ప్రధాన మంత్రి సమాధానాన్ని ఇస్తూ ఒక ట్వీట్ లో -

"శ్రీ ప్రముఖ్ స్వామి మహారాజ్ జీ జయంతి సందర్భం లో ఆయన కు నేను శ్రద్ధాంజలి ని ఘటిస్తున్నాను. ఆయన తో అనేక సందర్భాల లో మాట్లాడే అవకాశం లభించినందుకు మరి ఆయన వద్ద నుండి బోలెడంత వాత్సల్యం కూడా దక్కినందుకు నన్ను నేను ఎంతో అదృష్టవంతుడి గా భావిస్తున్నాను. సమాజాని కి అద్భుతమైన అగ్రగామి సేవల ను అందించినందుకు గాను ఆయన ను ప్రపంచం అంతటా ఆయన ను ప్రశంసించడం జరుగుతున్నది." అని పేర్కొన్నారు.

షాద్ నగర్‌లో భారీగా గంజాయి పట్టివేత.. నలుగురు అరెస్ట్..

రంగారెడ్డి, డిసెంబర్ 2: రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్ లో భారీగా గంజాయి పట్టుబడింది. పాన్ షాపుల్లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

హైదరాబాద్ శివారులో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నాలుగు కిలోలకు పైగా గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు పోలీసులు. ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థులే టార్గెట్ గా గంజాయి చాక్లెట్లు విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

పాదయాత్రకు భారీ స్పందన...

- తెరాస ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్

ఖమ్మం, డిసెంబర్ 2 :(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలో శుక్రవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర కొనసాగింది. ఈ పాదయాత్రకు భారీ స్పందన వచ్చింది. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఖమ్మం టూ పరిధి లోని రేవతి సెంటర్ నుంచి తమిళ సెంటర్ వరకు పాదయాత్ర కొనసాగింది. పాదయాత్రను ప్రారంభించిన అనంతరం సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ... డబుల్ బెడ్ రూం ఇళ్ళు ఖమ్మం నియోజకవర్గంలో అర్హత కలిగినవారికి అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు వేల డబుల్ బెడ్ రూం ఇళ్ళు ఖమ్మం నియోజకవర్గంలో పెండింగ్ లో వున్నాయని తెరాస ప్రజా ప్రతినిధులు ప్రజలకు సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు. సొంత స్థలం వున్న వారికి ఇల్లు కట్టుకోవడానికి ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతి సందర్భంలోనూ మూడు లక్షలు ఇస్తామని ఒకసారి, ఐదు లక్షలు ఇస్తామని ఒకసారి చెప్పడం తప్ప ఆచరణలో మాత్రం ఇంతవరకు చిల్లిగవ్వ కూడా మంజూరు చేయలేదు అని విమర్శించారు. ఖమ్మం నగరం లో అర్హత కలిగినవారికి పెన్షన్లు ఇవ్వడంలో తాత్సారం చేస్తున్నారు. అని, పెన్షన్లు విషయంలో రాజకీయ నాయకులు తల దూరుస్తురని, రాజకీయాలకు అతీతంగా పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 57 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్లు ఇస్తామని ఇచ్చిన ప్రభుత్వ హామీ ఏమైంది అని ప్రశ్నించారు. గత కొన్ని సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వకుండా ఆన్లైన్ నమోదు పేరుతో కాలయాపన చేస్తున్నారు అని వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నియోజకవర్గంలో ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలపై తెరాస ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే రాబోయే కాలంలో నిరంతరం ప్రజా సమస్యలపై దశలవారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్టీ జిల్లా ఇన్చార్జ సభ్యులు వై. విక్రమ్, టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు నర్రా రమేష్, ఆర్. ప్రకాష్, ఎండీ గౌస్, సిహెచ్. భద్రం, కె. వెంకన్న, బి. ఉపేంద్ర, జె. వెంకన్న బాబు, ఎన్. కుమారి, హుస్సేన్, వాసు, సూర్యం, రవీంద్ర, జలగం అనిల్ కుమార్, సాయి, కృష్ణవేణి, కనకదుర్గ, మల్లికార్జున్ రెడ్డి, రాజేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నెక్సస్ మాల్స్ అంబాసిడర్‌గా అమితాబ్ బచ్చన్



హైదరాబాద్, డిసెంబర్ 2: బ్లాక్‌స్టోన్ రియల్ ఎస్టేట్ ఫండ్స్ యాజమాన్యంలో నిర్వహించబడుతున్న భారతదేశంలోని రిటైల్ ప్లాట్‌ఫారమ్ అయిన నెక్సస్ మాల్స్, అమితాబ్ బచ్చన్‌ను తమ 'హ్యాపీనెస్ అంబాసిడర్'గా ప్రకటించింది. వినియోగదారులకు 'హర్ దిన్ కుచ్ నయా' అనుభవాన్ని అందించడానికి భారతదేశపు అతిపెద్ద ప్రపంచ సూపర్‌స్టార్‌తో ఇది ఒక ప్రత్యేకమైన భాగస్వామ్యం. అమితాబ్ బచ్చన్ భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ సెలబ్రిటీలలో ఒకరు, అతను వివిధ వయసుల సమూహాలలో ఆల్ టైమ్ ఫేవరెట్. అతను అవార్డు-గెలుచుకున్న నటనా వృత్తి మరియు స్వచ్ఛంద ప్రయత్నాలకు ప్రసిద్ధి చెందిన పరిచయం అవసరం లేని నటుడు. "మా నెక్సస్ మాల్స్ కుటుంబానికి అమితాబ్ బచ్చన్‌ను స్వాగతించడం మాకు చాలా విశేషం. అమితాబ్ వివిధ వయసుల వారితో కనెక్ట్ అవ్వడంలో అద్భుతమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాడు.

మా వినియోగదారులకు హర్ దిన్ కుచ్ నయా అనుభవాలను అందించడంలో మా వ్యాపార అభివృద్ధికి అమితాబ్ మన దేశపు అతిపెద్ద ఐకాన్‌లలో నెక్సస్ మాల్స్ భాగస్వామి అయినందుకు మేము గర్విస్తున్నాము, "అని నెక్సస్ మాల్స్ సీ ఈఓ దలీప్ సెహగల్ అన్నారు. మిస్టర్. అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ , "నేను నెక్సస్ మాల్స్‌ను ఆమోదించడానికి సంతోషిస్తున్నాను. కస్టమర్‌లు నెక్సస్ మాల్స్‌ను సందర్శించిన ప్రతిసారీ వారి కోసం కొత్త అనుభవాలను అందించడంలో మేము కలిసి ప్రయత్నిస్తామని ఆయన అన్నారు. 2016లో ప్రారంభించినప్పటి నుండి, నెక్సస్ 13 నగరాల్లో 17 ప్రాపర్టీలతో భారతదేశపు అతిపెద్ద రిటైల్ ప్లాట్‌ఫారమ్‌గా మారింది. జూన్ 2022లో, నెక్సస్ మాల్స్ ఒక కొత్త బ్రాండ్ గుర్తింపును ఆవిష్కరించింది అని సంస్థ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.